# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 1-1-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :32 సంచిక:118 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

గాజు పూసలు
పల్లియల నగలు
సహజ అందాలు.

శుభగీతాలు
ఆశావాహక ఝరి
జన ఆహ్వానం.

శూన్య విచారం
జ్ఞానతత్వ చింతన
పిచ్చి మాలోకం.

కొత్త ఏడాది
పాతకు వీడుకోలు
అంతా మేలేనోయ్

రాలిన ఆకులు
మాటల కవితలు
శిశిర వృక్షం



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ముమ్మందే అసెంబ్లీకి
కేసీఆరే వచ్చారు !
ముఖ్యమంత్రి రేవంతుడు
కరచాలనం ఇచ్చారు !
బాగున్నారా ! మీరూ !
అనుకుంటూనే, అందుకు
బయట సమావేశంలో
చావును కోరటమెందుకు ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# అన్ని కోణాల్లో అభివృద్ధి

**-ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 31: అన్ని కోణాల్లో అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన నేపథ్యంలో విస్తరించిన హైదరాబాద్ మహానగరం దేశానికే తలమానికంగా అవతరించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆ దిశగా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశాలిచ్చారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో కలిసి జోనల్ కమిషనర్లు ప్రతి రోజూ ఫీల్డ్ వర్క్ తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. ఎంతటి వ్యయమైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అదే సమయంలో 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యం నెరవేర్చే బాధ్యత మీదే" నని వ్యాఖ్యానించారు. నగరాన్ని వివిధ జోన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో కొత్తగా నియమితులైన జోనల్ కమిషనర్లతో ముఖ్యమంత్రి రేవంత్ బంజారా హిల్స్లోని ఇంటిగ్రెటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో పురపాలక, పట్టణాభివృద్ధి, రెవెన్యూ, ఆర్థిక శాఖలతో పాటు ఎఫ్ సీడీపీ, హెచ్ ఎండీఏ, జీహెచ్ఎంసీ, మెట్రో వాటర్ బోర్డు తదితర అనుబంధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'ఫ్యూచర్ సిటీ' వరకూ రాజధాని నగరం విస్తరణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిర్దేశిత కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి అవశ్యమని పేర్కొన్నారు. అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తేనే బహుళజాతి సంస్థల పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని, ఇప్పటికే కుదిరిన ఎంవోయూలు కార్య రూపంలోకి వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని సీఎం అన్నారు.

## శివలింగం ధ్వంసం ఘటన.. నిందితుడి అరెస్ట్.. ఏం జరిగిందో చెప్పిన ఎస్పీ


అమలాపురం, డిసెంబర్ 31: ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కపాలేశ్వర స్వామి శివలింగం ధ్వంసం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 24 గంటల్లోనే కేసును చేధించి.. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసుపై అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మీడియాతో మాట్లాడుతూ.. ఆలయ ఉద్యోగులతో వివాదాలే శివలింగం ధ్వంసానికి కారణమని తెలిపారు. ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శివలింగం ధ్వంసం కేసులో రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన శీలం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఇంటి వద్ద ఆలయ ఉద్యోగులతో వంట కాలువ స్థలం వివాదం నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగిందని వెల్లడించారు. ఆలయ పూజారి శివలింగానికి పూజ చేయడం చూసి రాత్రి ఒంటిగంట సమయంలో శ్రీనివాస్ శివలింగాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

## న్యూ ఇయర్ వేళ.. సీపీ సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్, డిసెంబర్ 31:నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పౌరులకు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు. హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555కు కాల్ చేయాలని తెలిపారు. రైడ్ డీటెయిల్స్ స్క్రీన్‌షాట్.. ఈ వాట్సాప్ నెంబర్‌కు పంపించాలని కోరారు. ఈ ఫిర్యాదుకు వాహన నెంబర్, సమయం, ప్రదేశం వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

బుధవారం (డిసెంబర్ 31వ తేదీ) అర్ధరాత్రి క్యాబ్, ఆటో రైడ్‌కు నిరాకరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుక్ చేసిన ఛార్జ్ కంటే అధికంగా డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోటర్ వాహనాల చట్టం 178 (3)(ఎ) సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు. న్యూ ఇయర్ వేడుకల్లో భద్రతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



జనగామ, డిసెంబర్ 31: జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై లింగాల గణపురం మండలం వడిచర్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ బండి శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన సయ్యపురాజు, రాంప్రసాద్, లవ కుమార్, శరత్ కుమార్ రామగుండంలో జరిగిన ఈవెంట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వడిచెర్ల సమీపంలో జనగామ వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు.

ఈ క్రమంలో నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ డీసీఎంను గమనించకుండా ఎదురుగా వెళ్లి ఢీకొట్టాడు.

ఈ సంఘటనలో కారులో ఉన్న విజయవాడ చెందిన సయ్యపురాజు విష్ణువర్ధన్ అలియాస్ బబ్లు(32) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా జనగామ హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నిధులు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 31:ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

జూన్ నెలాఖరులో183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్‌లు ఉన్నాయి.

# కేంద్రానికి కోమటిరెడ్డి లేఖ..

హైదరాబాద్, డిసెంబర్ 31: సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. జనవరి 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు టోల్ ప్లాజాల వద్ద టోల్ ఫ్రీ దిశగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కిలోమీటర్ల కొద్దీ గంటల పాటు ట్రాఫిక్లో నరకయాతనకు గురికాకుండా ప్రయాణికులకు స్వాంతన చేకూర్చేలా మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి ఊళ్లకు వెళ్లి వచ్చే వాహనాలకు టోల్ వసూలు చేయొద్దని కోరుతూ ఆయన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు.

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లి, వచ్చే వాహనాలకు టోల్ వసూలు చేయొద్దని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఆ రోజుల్లో టోల్ ప్లాజాల దగ్గర ఫ్రీ వే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ, తెలంగాణలో సంక్రాంతి అతిపెద్ద పండుగ అని, ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి విజయవాడ మార్గంలో జనవరి 13 వరకు వాహనాల రాక విపరీతంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ గేట్ల దగ్గర ఉన్న డేటా ప్రకారం.. సాధారణ రోజుల కంటే ఈ సమయంలో 200 శాతం అదనపు ట్రాఫిక్ ఉంటుందని వివరించారు. టోల్ ప్లాజాల దగ్గర ప్రయాణికులు తీవ్ర జాప్యానికి గురవుతున్నారని తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో నేషనల్ హైవేల పై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యల పై మంగళవారం సమీక్ష నిర్వహించారు.

# నేరాల నియంత్రణపై ఫోకస్ చేయండి

**-రోడ్డు ప్రమాదాలు, చోరీలను నియంత్రించండి**
**-రౌడీషీటర్లు, భూ కబ్జాదారుల ఆటకట్టించాలి**
**-సంఘ విద్రోహశక్తులపై కన్నేయండి**
**-వృద్ధుల సమస్యలను తీర్చండి**
**-పోలీస్ ఇమేజ్ పెంచేరీతిలో పనితనం ప్రదర్శించాలి**
**-సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత**
**-మడికొండ ఠాణాను తనిఖీ చేసిన సెంట్రల్ జోన్ డిసిపి**

వరంగల్ డిసెంబర్ 31:నేరాల నియంత్రణపై పోలీసులు ఫోకస్ చేయాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆదేశించారు. హైవే రోడ్లపై రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలు చేపట్టడం, చోరీల కట్టడికై పక్కాగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, భూ కబ్జాదారుల ఆట కట్టించాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత పేర్కొన్నారు. మడికొండ పోలీస్ స్టేషన్ ను ఇవాళ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పోలీస్ అధికారులంతా సంఘ విద్రోహశక్తులపై కన్నేయాలని

ముఖ్యంగా ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసే వృద్ధుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. పోలీస్ సిబ్బంది అంతా పోలీస్ ఇమేజ్ పెంచే రీతిలో పనితనం ప్రదర్శించాలని ఉద్బోధించారు. మడికొండ పోలీస్ ఇన్ స్పెక్టర్ పుల్యాల కిషన్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డిలు డీసీపీ ధార కవితకు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ ను సెంట్రల్ జోన్ డీసీపీ కవిత తనిఖీ చేశారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. డీసీపీ ఠాణా ఆవరణలో మామిడి చెట్టును నాటారు. అనంతరం స్టేషన్ లో ఉన్న అన్ని గదులను, మెయింటనెన్స్ ను పరిశీలించారు. గత మూడు సంవత్సరాల నేరాలకు సంబంధించిన రికార్డులను, కేసుల వివరాలను తెలుసుకొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, నివారణ కోసం తీసుకున్న చర్యల గూర్చి వివరాలు ఆరా తీశారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బందికి ఉన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత హామీ ఇచ్చారు. సమాజంలో పోలీసుల గౌరవ, మర్యాదలు పెంచే రీతిలో సిబ్బంది పనితీరు కొనసాగించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. నిత్యం శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఠాణాకు వచ్చే ప్రతి చిన్న సమస్యపై ప్రతిస్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నేర నియంత్రణ విషయంలో పోలీస్ ఆఫీసర్స్ రాజీ పడొద్దని ఆదేశించారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీట్స్ ఉన్న వ్యక్తులపై నిరంతరం నిఘా వేయాలని సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీల్లో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్స్ పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజబాబు, రాజ్ కుమార్, రామ్ మోహన్, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీచర సునీతా రావు 2025 సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

స్వర్గీయ పీచర సునీతారావు పేరుతో ఈ సంవత్సరం యథాక్రమంగా ఐదవ వార్షిక పురస్కారాలు ప్రదానం చేయడంకోసం పీచర సునీతా రావు ఫౌండేషన్ ,కవిత్వం, కథలు ,విమర్శ అనే మూడు సాహితీ విభాగాలకు సంపుటులను అహ్వానిస్తున్నది. మార్చ్2022 నుండి డిసెంబర్ 2025 వరకు వెలువడిన రచనలే పంపించాలి. ఇంతకంటే ముందుగాని తరువాత గానీ వచ్చిన రచనలు పరిశీలించబడవు. కవిత్వం,కథ, విమర్శలో ఎన్నికైన ప్రతి సంపుటానికి మే 10,2026 న రవీంద్రభారతిలో పీచర సునీత సంస్మరణ తో జరిగే సభలో 15000 రు. నగదు మరియు సాహితీ ప్రముఖులతో సత్కారం ఉంటుంది.

రచయితలు ప్రతి విభాగంలో మూడు కాపీలు పంపించాలి. రచనలు మాకు చేరవలసిన చివరి తేది ఫిబ్రవరి 25, 2026 .

రచనలు పంపించాల్సిన చిరునామా: పీచర సునీతా రావు ఫౌండేషన్, కేర్ ఆఫ్ల విజయేందర్ రావు, ప్లాట్. నం.505, బ్లాక్ -డి .భీమాప్రైడ్ అపార్ట్ మెంట్స్, నియర్ సుచిత్ర సర్కిల్ ,జీడిమెట్ల ,హై దరాబాద్-67. సెల్:9866043441 9848698699

-విజయేందర్ రావు
పీచర సునీతా రావు ఫౌండేషన్ చైర్ మెన్

## "తొలి సంతకం" సామాజిక కవితాసంపుటి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

డిసెంబర్ 30న మొయినాబాద్ లో ప్రముఖ వ్యాఖ్యాత్రి, సినీగీత రచయిత్రి విశ్వైక గారు రచించిన **"తొలి సంతకం"** సామాజిక కవితాసంపుటి పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్, పూర్వ ఎలక్షన్ కమిషనర్, తెలంగాణ, శ్రీ పార్థసారథి, అధ్యక్షులుగా మామిడి హరికృష్ణ గారు, విశిష్ట అతిథిగా తరుణి సంస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి మమతా రఘువీర్, గౌరవ అతిథిగా శ్రీ మౌనశ్రీ మల్లిక్, ఆత్మీయ అతిథిగా అక్షరయాన్ అధినేత్రి శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మీ హాజరయ్యారు. విశ్వైక అనేక రంగాలలో తన ప్రతిభను కనపరుస్తూ ఉందని, చాలా తక్కువ మందిలో ఈ రకమైన ప్రతిభ ఉంటుందని, 'తొలి సంతకం' పుస్తకంలో ఎన్నో రకాలైన సామాజిక అంశాల గురించి వైవిధ్యభరితంగా కవిత్వం అందించారని కొనియాడారు. మరిన్ని కవితా సంపుటులు తీసుకురావాలని అతిథులు సూచనలు చేశారు. విశ్వైక గారు స్పందిస్తూ సాహిత్యానికి పాటల రచయితగా పరిచయమైన తాను కవిత్వం యొక్క విశిష్టత వల్ల దాని వైపు ఆకర్షితురాలినయ్యానని, పన్నెండు సంవత్సరాల నుండి కవితలు రాస్తున్నప్పటికీ ఇన్నాళ్లకు పుస్తకం తీసుకురావడం కుదిరిందని, తన పుస్తకంలో కవితలు మెరుగ్గా రావా లన్న కోరికే ఇన్నాళ్లూ వేచి ఉండేలా చేసిందని చెప్పారు. 'తొలి సంతకం' పుస్తకాన్ని తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లుగా తెలిపారు. మరో రెండు పుస్తకాలు కూడా ప్రచురణలో ఉన్నాయని తెలియజేశారు. రచయితలు, మిత్రులు, తరుణీ సంస్థ విద్యార్థినులతో సభ చాలా రసవత్తరంగా సాగింది.

# కలుషిత నీరు తాగి ఎనిమిది మంది మృతి.. 100 మంది పరిస్థితి విషమం

మధ్యప్రదేశ్, డిసెంబర్ 31: మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కలుషిత నీటి ని తాగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. భగీరత్‌పుర కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 25 నుంచి 30 మధ్య ఈ మరణాలు నమోదయ్యాయి. డిసెంబర్ 25న మున్సిపల్ అధికారులు సరఫరా చేసిన కొళాయి నీటిలో ఓ విధమైన వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. ఆ నీటిని తాగి పలువురు అస్వస్థతకు గురవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఆ కాలనీకి చేరుకొని నీటిని పరిశీలించారు.

నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ పరిస్థితి విషమించి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మేయర్ తెలిపారు. ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి

**-వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి జిల్లా కలెక్టర్లు, ఎస్టీ, ఎస్సీ అధికారులతో సమీక్ష**

భూపాలపల్లి , డిసెంబర్ 31: ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడి ఓసిలో ఇవాళ మూడు జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్షలో భూపాలపల్లి జిల్లా ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు, వరంగల్ కలెక్టర్ సత్య శారాద, హన్మకొండ స్నేహ శబరిష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, పివో చిత్ర, అదనపు కలెక్టర్లు, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాల వారీగా ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, వసతి గృహల ప్రోగ్రెస్ ను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వసతి గృహాల్లో, గురుకులాల్లో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి వసతి గృహాల్లో ఖచ్చితంగా సీసీ కెమెరాలుఏర్పాటు చేయాలని, బాలికల వసతి గృహాల్లో ప్రత్యేక సెక్యూరిటీని నియమించాలని సూచించారు. ప్రతి వారం విద్యార్థుల హెల్త్ చెకప్ చేయాలన్నారు. వసతి గృహాలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అధికారులు విద్యార్థులకు తల్లిదండ్రుల్లా వ్యవహరిస్తూ జవాబుదారిగా వుండాలన్నారు.

జిల్లా అధికారులు వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమస్యలుంటే కలెక్టర్ ద్వారా తమకు నివేదిక పంపించాలని మంత్రి సూచించారు. ప్రతి బాలిక హాస్టల్ ను రోజు షీ టీమ్ లు సందర్శించాలన్నారు.

## చురక

ప్రకృతి పర్యావరణం
పాడుచేసే మైనింగ్
ఆరావళి తవ్వకోను
అది వేసెను లైనింగ్.
కార్పోరేట్ల కబ్జాలకు
కేంద్రమిచ్చే లైసెన్సు
ప్రమాదమే దేశానికి
ప్రజలుంటే సైలెన్సు



-వేల్పుల నారాయణ
9440433475

## రాధశ్రీ రాగాలు

క్రొత్త సంవత్సరము
వెలిగించు మానసము
కలిగించు జయచయము
అనును రాధశ్రీ
తెచ్చి పెట్టగ పేరు
హెచ్చు వేయగ జోరు
వచ్చె ఇరవై య్యారు
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210

# నీలోని నిశ్శబ్దాన్ని నిషేధించు

నైతికతలకు నీళ్లు వదులుతున్న
నీచులకు నీరాజనాలు పడుతూ
నిలువెల్లా గాయాలవుతున్న
నిమ్మకు నీరెత్తినట్టున్న ఓ మనిషి
నీలోని నిశ్శబ్దాన్ని నిషేధించు-
భక్తి పేరా భ్రమలలో బతుకుతున్న
భజన అంటూ బ్రహ్మోత్సవాలంటూ
బాబాల సేవలో పావనమవుతున్న
భక్తవత్సలులారా భిన్నత్వంలో ఏకత్వం కోసం
నీలోని నిశ్శబ్దాన్ని నిషేధించు-
నినదించాల్సిన చోట నోరు మూసుకుంటూ
వినవలసిన చోట చెవులు మోసుకుంటూ
కళ్ళెర్ర చేయాల్సిన చోట కళ్ళు మూసుకుంటూ
అంటి ముట్టనట్టు ముడుచుకున్న ఓ మనిషి
నీలోని నిశ్శబ్దాన్ని నిషేధించు-
రీళ్ళ చుట్టల్లో రోల్ అయిపోతున్న
ఫేస్బుక్ పేజీల మధ్య లైక్ వై నిలిచి
ఇంస్టాగ్రాంలో ఇన్స్టంట్ బందివై
వాట్సప్ వాగ్వివాదాలు చేసుకుంటూ
పిడికిలెత్తలేని పిరికోడివైన ఓ మనిషి
నీలో నిశ్శబ్దానికి నిషేధించు-
ప్రకృతి ప్రకోపానికి పడిశం పట్టిన వాడిలా
ముక్కు మూతి మూసుకు కూర్చున్నావా
పక్కనోడు పక పక నవ్వకముందే
నీలో నిశ్శబ్దాన్ని నిషేధించు
ప్రాసంగిత ఏదని ప్రశ్నవై ఉదయించు



-డా.ఎడ్ల కల్లేశ్
9866765126

# తత్-దినములు

ఏ చెట్టు పండుటాకులు
ఆ చెట్టుకే ఎరువయినట్లు
ఎదిగిన పిల్ల పాపల భవితవ్యానికి పునాదిలా
కనిపించని కంచు గోడలా నిలిచే
వృద్ధులు ఊరూరా పెరిగిపోతున్నారు
మాగిన కొద్దీ మామిడి పండులా!
ఊరిన కొద్దీ ఊరగాయలా!
దివ్య రసాలను మధురంగా
అందిస్తూనే ఉంటారు
వత్తిడిలో పిల్లల ఊరటకు ఆసరాగా!
కానీ కొందరు పిల్లలు తలిదండ్రులను మరచి
వృద్ధులని మరచి కనీసం మనుషులని మరచి
పండు తన బీజాన్ని మరచినట్టు
పండించిన కొమ్మను మరచినట్టు
చెట్టును మరచి-పేరును మరచినట్టు
నాటిన యజమానిని మరచినట్టు
భూమిని మరచి
వయసుడిగిన తలిదండ్రులకు
ముందుగనే శ్మశాన వాసం నేర్పే
పైశాచిక సంస్కృతిని సాగిస్తూ
తల్లిదినం-తండ్రిదినం
ప్రేమదినం-రాగదినం
యోగదినం-పుట్టిన దినం
మెట్టినదినం-గిట్టిన దినం
అంటూ ఎందుకీ "తత్'దినాలు?
ప్రతిదినం- ఒక అమ్మదనమంత
కమ్మని దినాలు జరుపుకుంటూ
ప్రతి స్త్రీలో అమ్మని
ప్రతి పురుషుడిలో తండ్రిని
చూస్తూ ప్రేమిస్తే చాలదూ
ఎందుకీ "తత్"దినాలు?
(తద్దినాలు)



-పంకజ మల్లిక్
సెల్: 9866065462

# పుడమి తల్లీ మళ్ళీ పుడతా...

భరతమాతా!
నీ కడుపున పుట్టిన అదృష్టమమ్మా!
జాతి గర్వించేలా ధరణిని రక్షిస్తానమ్మా!
పుడమి తల్లీ మళ్ళీ పుడతా!
భూమాత వడిలో పరవశించగల్గే
అందాల ఆకుపచ్చని మన దేవతలా
పులకరింత కలిగించే జీవ వైవిధ్యానికి
కారణజన్మమైన ప్రకృతి కాంతై
ఈ పుణ్యభూమి ధరణీమాతపై మళ్ళీ పుడతా.
విశ్వంలో సమస్త సృష్టికి మూల్యమైన
అణు పరమాణువుల అతీతశక్తి
పంచభూతాల్లో మమేకమై
ఈ జీవజాతి పుట్టుకకు మూల కారకమైన
జలజల పారే సరస్సుల నదీమ తల్లి
వరుణ దేవతగా మళ్ళీపుడతా
నింగి, నేల, గాలి,నీరు, నిప్పు,సమాగమమే
పంచ భూతాలు సృష్టి రహస్యాన్ని ఛేధించగల్గే
అమూల్యమైన శక్తి స్వరూపం
సర్వశక్తి సంపన్నుడై గ్రహాలు గ్రహశకలాల
సృష్టికర్తైన భానుడిలా మళ్ళీ పుడతా.
బిలయన్నక్షత్రాల్లో
స్వయం ప్రకాశిత భాను చుట్టూ
పరిభ్రమిస్తూ ఏర్పడిన నవగ్రహాలుండగా
మన భూమాత పైనే జీవజాతి మనగలిగే
మహాద్భుతశక్తి సంపన్నురాలైన
పుడమి తల్లినై మళ్ళీ పుడతా.
సర్వస్వం మనకందించే దరిత్రిని
మైనింగ్ మాఫియా ధ్వంసం చేస్తూ
గిరులు తరులు పంచభూ తాల్నీ
కాలుష్యకాసారంగామార్చి,
తనగొయ్యి తానే త్రవ్వుకునే మనిషికి
కను విప్పు కలిగించేలా
ధరనిమాతై మళ్ళీ పుడతా.
మనిషి దురాశకు దుర్గంధ పూరిత వాయు
కాలుష్యంతో జీవజాతులు
నికృష్ట స్వార్థపరుల దాహానికి
బలై పోతుంటే ప్రకృతి పరిరక్షణ
కార్యక్రమాలు సాఫల్యంకై చేయుటకై
వాయుదేవతనై మళ్ళీ పుడతా.
పాడిపంటలు తరిగి భూప్రకోపం పెరిగి
సృష్టించే భూకంపాలు,
సునామీలు భరిస్తూ ఇప్పుడైనా
కళ్ళు తెరిచి జీవజాతుల్ని రక్షించకపోతే
మనిషి ఉనికిని ప్రమాదమని
ధరిత్రీ పండగచేస్తూ
మానవత్వంతో బ్రతుకుతా,
మళ్ళీ మళ్ళీ
పుడుతూనే ఉంటా.



-డా॥ఉషారాని కోగంటి
సెల:8179611745



# కోడి చేసిన మేలు

(కథ)

నరహరిపురంలో శరభయ్య అను ఇంటి యజమాని ఉండేవాడు. అతడు ఒక కోడిని, ఒక ఆవును పెంచుతున్నాడు. అతనికి రాము అని ఒకే ఒక్క కుమారుడు ఉన్నాడు . ఆ బాలుడు చాలా చిన్నవాడు.

ఒకసారి రాము ఇంటి బయటకు వచ్చి వచ్చి పోయే వాహనాలు చూస్తూ అక్కడ నిలబడి ఉన్నాడు. ఇంతలో శరభయ్య పెంపుడు కోడి వచ్చి అరుస్తూ ఆ బాలుని తన ముక్కుతో పొడవబోయింది. ఆ బాలుడు ఏడుస్తూ ప్రక్కకు జరిగాడు. ఆ తర్వాత ఆ కోడి అరుస్తూ ఆ రామును తిరిగి పొడవబోయింది. ఆ బాలుడు భయపడి "నాన్నా! ఈ కోడి నన్ను పొడుస్తూంది. త్వరగా రా!" అంటూ కేకలు పెట్టాడు.

వెంటనే శరభయ్య పరిగెత్తుకుని వచ్చి ఆ కోడిని తన కాలుతో గట్టిగా ఒక్క తన్ను తన్నాడు. ఆ కోడి తిరిగి అరచింది. మళ్లీ శరభయ్య కోపంతో ఆ కోడిని ఒక్క తన్ను తన్నాడు. ఆ తర్వాత అతడు తన బాబును తీసుకొని లోపలికి వచ్చాడు. అతని భార్య ఏమైందని ప్రశ్నించింది. అప్పుడు శరభయ్య "ఏమైందేమిటే! మన పెంపుడు కోడి ఎంత విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టింది . అది మన గారాల బిడ్డ బాబుని తన ముక్కుతో పొడుస్తున్నది. రేపే దాన్ని తీసుకుని వెళ్లి సంతలో అమ్ముతాను" అని అన్నాడు.

ఇంతలో ఎవరో పిలిచారని అతని భార్య బయటకు వెళ్ళింది. కొద్ది సేపటికి ఆమె లోపలికి వచ్చి "అయ్యో! మీరు ఎంత తొందరపడ్డారండి? అక్కడ ఒక తేలు తిరుగుతున్నదట. అది మన బాబును కరవబోయిందట. అందుకే ఆ కోడి అతడు అక్కడి నుండి జరగడానికి తన ముక్కుతో మన బాబును పొడుస్తానని బెదిరించిందట. అది తనను పొడవవచ్చేసరికి మన బాబు పక్కకు జరిగాడు. మన బాబు అక్కడే నిలబడి ఉంటే ఆ తేలు వాడిని కాటు వేసేది. అది తేలు నుండి మన బాలుని కాపాడింది. మీరు అదేది గమనించలేదు. పైగా ఆ కోడిని కాలితో తన్నారు. పొరుగుంటావిడ ఇది చూసి నాకు ఈ సంగతి చెబితే ప్రత్యక్షంగా నేను కూడా ఆ తేలును చూసి వచ్చాను" అని అంది. అప్పుడు శరభయ్య" ఇప్పుడు ఆ తేలు అక్కడ ఉందా?"అని ప్రశ్నించాడు. "లేదు. లేదు ఆ దారిలో వెళుతున్న ఒక బాటసారి ఒకరు ఆ తేలును పట్టుకొని వెళ్లి దూరంగా విసిరి వేశాడు. ఈ తప్పు ఆ కోడిది కాదు . మన బాబుది. అందుకే ఆ కోడి అరుస్తూ వాడు లోపలికి వెళ్లాలని వాడిని పొడవబోయింది" అని అంది.

అది విన్న శరభయ్య "అయ్యో! ఎంత పని జరిగింది. నేనే దాన్ని అపార్థం చేసుకున్నాను. ఇక దాన్ని సంతలో అమ్మనే అమ్మను" అని అన్నాడు. భర్త మాటలకు ఆ భార్య ఎంతో సంతోషించింది.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

# సమయం కీలకం

మితిమీరిన ఆశ
మిగులుస్తుంది నిరాశనే
అతిగా ఆశించకు
ఆవేశం తగ్గించుకో
అన్నిటికి స్పందన వద్దు
ఎదుటి వారి తీరు చూడు
వ్యసనపరులకు హితం
ఒక పట్టున అంటదు
కాలం సమయం కీలకం
పరిష్కారాలకు కొలమానం
ప్రయత్నం మాత్రం ఆపకు
తక్షణమే ఫలితం ఆశించకు
గమ్యం సాధనకుకు కావాలి
అసలు సమయం



-పత్తి శివప్రసాద్
9440001224

## సప్త పదులు

ఆధరం
మధురం

తేనె పిల్లలకు
పెద్దలకు
కలిగించు
సుమధురం.

-సంకా శోభారాణి.
9703858539.

తరంగం
అంతరంగం

ఎన్నో అనుభూతులు,
అనుభవాలతో
కూడినదే
జీవితరంగం

-తిప్పావఝుల నరసింహమూర్తి
బుచ్చిరెడ్డి పాలెం

అనిపించాలి
అనుభవించాలి

దేశాభివృద్ధిని
ప్రతిపౌరుడు
తనజీవిత సర్వస్వంగా
భావించాలి.

-శ్రీపెరంబుదూరు నారాయణ రావు'శ్రీనారా'

పిరికి
పెరికి

దీక్షబూని
పట్టుదలతోసాగు.
చేరగలవు
నీవేముందుగా బరికి.

-కరకవలస భాస్కరరాజు
9494181045

పణము
కణము

వృథాచేయక,
కష్టపడితేనే
గెలవగలం
ఒక్కో క్షణము!!

-బత్తిన గీతాకుమారి
7659848289

మానం
కొలమానం

ప్రతిభ
కనబరిచిన వారికివ్వాలి
తప్పక
బహుమానం.

-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు
9490904976

సదనము
కదనము

ఇంట్లో
ఘర్షణలు
లేకుండాఉంటే
కళకళలాడుతుంటుంది
ఇల్లాలివదనము

-విజయకుమారి ముదిగొండ

నీతి
రీతి

న్యాయాన్ని
ధర్మాన్ని
వీధుల పాల్జేస్తున్న
అవినీతి..

-పద్మావతి పి.

పిలుపు
అలుపు

పల్లెటూళ్ళలో
జనపదానికి
కోడి కూతే ..
మేలుకొలుపు .

-కాకర్ల, చెంచలరావు


అర్థం
అపార్థం

అక్షరంతేడాతో జీవితాలే
మారిపోతాయి
తెలుసుకోవాలి
పరమార్థం
కూర్పు -సొట్టుభవానీదేవి,

నాటి తరం వారి కథలు నేటి తరానికి
## కథల వంతెన

# మనిషీ-మాను

(కథ)



- కూర చిదంబరం
సెల్: 8639338675

వరుసగా మూడు రోజుల నుండి గాలివాన ఊరి నంతా కుదిపేస్తోంది. "వెధవ్వాన! వెధవ్వాన" అంటూ మరింత ముడుచుకుని కూర్చున్నాడు రాజాలు.

వాడు అలా అనుకోవటం వందోసారి. అంతకన్నా ఎక్కువే అయి ఉంటుంది. మూడురోజుల నుండి ధారాపాతంగా కురుస్తున్న వానని తిడుతూనే ఉన్నాడు. ఎంత తిడుతున్నా, శిస్తు వసూలుకి వచ్చిన సుంకరిలా వాన వదలటం లేదు. పై పెచ్చు ఈరోజుమరింత ఉధృతంగా ఉంది. గుడిసె మీద కప్పిన తాటాకులు గాలికి సగానికి పైగా ఎగిరిపోయాయి. మిగిలినవి కూడా 'ఇప్పుడో అప్పుడో' అన్నట్లు ఎదురుచూస్తున్నాయి. పొగచూరిన తాటాకు కొసల్లోంచి నల్లటి వాననీరు రాజాలుపై పడుతోంది. అయిదారు మూరల పొడవు, అంతే వెడల్పు రాజాలు గుడిసె. రెండే రెండు నిలువు కర్రలు పాతి అడ్డ కర్రలు కట్టారు. అడ్డ కర్ర రెండోవేపు దట్టంగా పెరిగి, విశాలంగా పరుచుకున్న వేపచెట్టు కొమ్మల్లో దూర్చారు. సగం ఎగిరిపోయిన ఆ తాటాకు గుడిసె ముందు వణుకుతూ కూర్చున్నాడు రాజాలు. ఈదురుగాలికి వేపకొమ్మలు వళ్ళు దులుపుతున్న జీవాల్లా నీటిని విదిల్చాయి.

నాగరికతకు దూరంగా ఎర్ర బస్సు కూడా ఎరగని ఆ పల్లెటూళ్ళో. పట్టుమని ఏభై ఇళ్ళు కూడా లేవు. అందులో నలభయి అయిదు పూరి గుడిసెలే. పటేలు దొక్కటే భవంతి. సెట్టిగారిది పెంకుటిల్లు. రాతితో కట్టిన చిన్న రామాలయం. ఊరికి ఓ కొస దెయ్యాల దిబ్బ, దిబ్బ మీద విశాలా ంగా విస్తరించుకున్న ఓ వేపచెట్టు. చెట్టు మొదట్లో రాజాలు గుడిసె. 'దయ్యాల దిబ్బ' అని పేరు వచ్చినందువల్లనో లేక స్మశానా నికి అనుకుని ఉన్నందువల్లనో, దిబ్బవేపు వెళ్ళాలంటే ఊళ్ళో వాళ్ళు జంకుతారు.

×××

మరోసారి ఈదురుగాలి 'ఫెడీ'మని కొట్టింది. తడిసిన ఒంటిమీద గుడ్డల్లోంచి వంటిని బ్లేడులా కోస్తున్నట్లు వణుకు. గుడిసెలో వస్తువులన్నీ తడిసి ముద్దయి పోయాయి. నాభిలోంచి ఎగదన్నుకు వస్తున్నాయి చలీ వణుకూ, తడుముతూ జేబీలోంచి బీడికట్ట అగ్గిపెట్టె తీసాడు. నాలుగే నాలుగు అగ్గిపుల్లలు కట్టలోంచి బీడీ ఒకటి లాగి మునిపంట బిగించి పుల్లగీసాడు. నానిన అగ్గిపుల్ల తలపెచ్చులుగా ఊడిపోతోంది తప్ప పుల్ల వెలగటం లేదు. "దీనెమ్మ..." అంటూ ఓ బూతుతో కసిగా పుల్లను విసిరేసాడు. వాన వెలిసేదాక, సెట్టి కొట్టులో కొత్త అగ్గిపెట్టె కొనేదాక ఈ కాస్త వెచ్చదనం కూడా పోయిందనుకున్నాడు. తలెత్తి ఆకాశం వంక చూసాడు చిల్లులు పడ్డ కుండలా కారుతూనే ఉంది. ఊరివేపు చూసాడు. బూడిదరంగు పొగచూరినట్లు ఊరంతా అస్పష్టంగా ఉంది. ఎప్పుడూ తిరిగే ఊర కుక్కలు, పందులు ఏవీ కనబడలేదు. చచ్చినవి చావగా, మిగిలినవి రాజాలులాగా ఏ చెట్టు క్రిందో తలదాచుకుంటున్నాయి కాబోలు!

మళ్ళీ ఒకసారి ఈదురుగాలి వచ్చింది. 'టపటపా' మంటూ కొమ్మల కొసల నుండి నీరు ధారాపాతంగా కారుతోంది. పుచ్చిపోయిన నిలువు కర్రలు, అడ్డకర్రలు నేలకు ఒరిగాయి. 'ఉన్న ఈ ఒక్క గూడూ పోయింది. ఇక వానంతా తనమీదే' అనుకున్నాడు రాజాలు. విసుగ్గా అటూ ఇటూ కదిలాడు.

ఆశ్చర్యం! దట్టంగా పెరిగిన వేపకొమ్మలు అమ్మలా చేతులు సాచి పొదుము కున్నట్లుంది రాజాలుకు. వాననీరు రాజాలుపై పడటం లేదు. బేలగా ఏడుస్తున్న పసిపాపను ఒళ్ళోకి తీసుకుని వీపు చరిచి, 'భయం లేదు కన్నా' అని పొదువుకున్నట్లు అనిపించింది. అంతటి వణుకుల్లో కూడా ఆశ్చర్యం, సంతోషం.

చెట్టు మొదట్లో తనకొక్కడికే ఆశ్రయం ఇచ్చినా, చెట్టుపైన మాత్రం ఎన్నో పక్షులు, పిచ్చుకలు, కొంగలు. జనావాసాలకి దగ్గరగా నివసించే సమస్త పక్షిజాతులు చెట్టుపైన కాపురం. చైత్రమాసం వచ్చిందంటే వేపపూవు చెట్టునిండా విరగబూసి తెల్లని మేఘాల్లా చెట్టుని కప్పేస్తుంది. సాయంకాలమైతే చాలు, వేప పూల కమ్మదనం చేదూ, వగరు కలిసిన వాసన దిబ్బనిండా అలుముకుంటుంది. పుట్టి బుద్దెరిగినప్పటి నుండి రాజాలుకి ఆ చెట్టు క్రిందే కాపురం, తల్లీ, తండ్రి, కట్టుకున్న ఆడది అందరూ దూరమైనా, చెట్టు క్రిందకి రాగానే అమ్మ వళ్ళో కూర్చున్నంత ఊరట, నిశ్చింత, వేసవి వచ్చిందంటే పసుపు పచ్చని పండిన వేపపళ్ళు నేల రాలేవి. అందుకే కాచుక్కూచ్చున్నట్లూ, వేలకొద్ది చీమలు పళ్ళని ఆస్వాదిం చేవి. మరికొన్ని రోజులకు ఎండిన పళ్ళు అధమం ఓ పుట్టెడు నేల రాలేవి. బస్తాల కొద్ది సెట్టిగారు పప్పుబెల్లం ఇచ్చి కొనేవాడు. ఆ గింజల్లోంచి ఎక్కడో నూనె తీస్తారట. వేపచెట్టు గాలి మంచి దంటారు. అందుకనే కాబోలు ప్రతీ ఏడూ వానా కాలం రాగానే ఏదో ఓ 'గత్తర' రావటం, పెద్దా చిన్నా అనే భేదం లేకుండా, పండిన వేపపళ్ళలా ఊళ్ళో వాళ్ళు రాలిపోయినా, రాజాలు మాత్రం తక్కెడలోని వీశ రాయిలా దుక్కలా, తిన్నాతినకున్నా మట్టసంగా ఉన్నాడు.

వర్షం తగ్గుముఖం పడుతున్నది. ఓసారి దిబ్బ దిగి ఊళ్ళోకి వెళ్ళి వద్దామనిపించింది రాజాలుకి. ఎదుటి వ్యక్తి కష్టాల్లో ఉంటే ఏదో చెయ్యాలన్న ఉద్దేశం లేకున్నా, అట్లా నిలబడి చోద్యం చూడటం ఊళ్ళోవాళ్ళకి అలవాటు. 'నీకు వచ్చిన కష్టం నాకు రాలేదు' అని అనుకుని అదో రకమైన సంతృప్తి పొందటం కోసం కావొచ్చు. ఊరివేపు నడిచాడు. ఒక్క గుడిసె మిగల్లేదు. అన్నీ నేలకొరిగాయి. ఎటు చూసినా, కూలిన, మట్టి గోడలు, వాటిలోంచి పొడుచుకువచ్చిన గుడిసె తాలూకు అడ్డకర్రలు, నిలువు కర్రలు, పొగ చూరిన తాటాకులు, ఓ పెద్ద రాక్షస సమూహం నేలకొరిగినట్లు పడి ఉన్నాయి గుడిసెలన్నీ, శివాలయం నిండాజనాలు. దేముడు 'మైల' పడిపోతున్నాడని పూజారి గదమాయింపు. సెట్టిగారి వసారాలో పదిమంది కాపురం పెట్టారు. పైకి కసురుకుంటున్నా, లోనమాత్రం సెట్టిగారికి ఆనందగానే ఉంది. ఎన్నాళ్ళనుండో మిగిలిపోయి పురుగులుపట్టి తుట్టెలు కట్టిన పప్పు, బియ్యం రూపాయల్లోకి మారుతున్నది కనుక, ఇంకాస్త ముందుకు నడిచాడు రాజాలు. గొడ్లపాకలాంటి సింగిల్ టీచరు బడి నేలకొరిగింది. పాక పల్లంలో ఉండటం వల్ల పాక చుట్టూ నీరు మడుగు కట్టింది. ఊరు చివర దాకా నడిచాడు. మాదిగ ముత్తెం పాకముందు జనం. ముత్తెం భార్య నెత్తీ, గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. ముత్తెం నిన్నరాత్రి పోయాడట. ముత్తేనికి దమ్ము రోగం. వానాకాలం వస్తే చాలు- గొంతు లోంచి పిల్లికూతలు. రాత్రంతా కుంపటి ముందే కూర్చుని ఉంటాడు. చూరు నీళ్ళు కన్నీళ్ళు కలిసి ముత్తెం భార్య ముఖమంతా నల్లటి చారికలు. శవాన్ని కల్చటానికి ఎండుపుడగకల్లేవు. పూడ్చటానికి మనుషుల్లేరు. పటేలింటికి వెళ్ళి ముత్తెం భార్య మొరపెట్టుకుందిట. 'బతికున్న వాళ్ళనే పట్టించుకోను దిక్కులేదు. వాన కాస్త తగ్గని చూద్దాం' అన్నాడట పటేలు. ఆయనొక్కడు మాత్రం ఏం చెయ్యగలడు కనుక. ముత్తెంగాడి ఆరు గురు పిల్లలు ఇదేదో 'విపత్తు' అనుకో కుండా 'చిర్రాగోనీ' ఆడుతున్నారు. ఏడుస్తూ, ముక్కు చీదుతూ మధ్య మధ్య పిల్లల్ని శాపనార్థాలు పెడుతున్నది ముత్తెం భార్య. అయినా పిల్లలు గోల మానటం లేదు. రాత్రి బిక్కుబిక్కు మంటూ కూర్చున్నా వాన కాస్త తగ్గి తెల్లారింది కనుక 'విసుగు' భరించలేక ఆటల్లోకి దిగారు పిల్లలు.



ఊరంతా తిరిగి వాళ్ళందరినీ చూసాక, తనని ఆదుకున్న వేపచెట్టు మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది రాజాలుకి. 'ఈ చెట్టె లేకుంటే' అనుకున్నాడు. 'అమ్మో! తను మరో ముత్తెం అయిపోయేవారు. ఏడవటానికి పూడవటానికీ ఎవరూ లేక ఎప్పుడో వాన తగ్గాక సుంకరోళ్ళు వచ్చి

"నాగరికతకు దూరంగా ఎర్ర బస్సు కూడా ఎరగని ఆ పల్లెటూళ్ళో. పట్టుమని ఏభై ఇళ్ళు కూడా లేవు. అందులో నలభయి అయిదు పూరి గుడిసెలే. పటేలు దొక్కటే భవంతి"

కుళ్ళిన తన శరీరాన్ని చచ్చిన కుక్కను ఈడ్చుకుపోయినట్లు ఈడ్చుకెళ్ళే వారు' అనుకున్నాడు రాజాలు.

'అమ్మా వేపచెట్టు తల్లీ! నువ్వు నన్ను కాపాడిన దేవతవమ్మా' అని అనుకున్నాడు. వెనక్కి వచ్చి ఎప్పటిలా చెట్టు మొదట్లో కూర్చున్నాడు. నల్లటి మబ్బులున్న ఆకాశంలో కాస్తంత ఎండ పొడ కనిపించింది. చినుకులు తగ్గాయి. 'బ్రతి కాంరా దేవుడా' అనుకుంది ఊరంతా.

×××

ముసురుకు, ముసురు తరువాత వచ్చిన గత్తరకు పదిహేనుమంది దాకా పిట్టల్లా రాలి పోయారు. ఎవరింట్లో విన్నా ఏదో విపత్తు. వేపచెట్టు కొమ్మలు దట్టంగా విస్తరించి ఉండటం వల్లో మరెందువల్లో రాజాలుకు ఏ రోగము నొప్పి రాలేదు. ఆకలితో వచ్చిన పసిపిల్లాడికి కడుపునిండా పాలు త్రాగిన తరువాత కలిగే సంతృప్తి భావం కలిగింది రాజాలుకి. 'అమ్మా అయ్యా అయి ఈ చెట్టే కాపాడింది' అనుకున్నాడు. దిబ్బ మీద ఈ వేపచెట్టు కనుక లేకపోతే.. ఊహించుకోవటానికి భయం వేసింది వాడికి.

×××

రోజులు గడుస్తున్నాయి. భాద్రపద మాసపు ఉదయపు ఎండ రాజాలుని వెచ్చగా నిమురుతున్నది. గొంతుక్కూర్చుని బీడీ వెలిగించి వేపచెట్టుకు చేరగిలబడి చిన్మయానందంలో మునిగిపోయాడు రాజాలు.

"బావా! బావా" అన్న రాములు పిలుపు తో ఈ లోకంలోకి వచ్చాడు. రాములు తన కుంటి కాలును ఈడ్చుకుంటూ దిబ్బమీదికి నడుస్తున్నాడు. వాడికి చొరవ ఎక్కువ. ఊళ్ళోకి ఏ కొత్త వ్యక్తి వచ్చినా, ఏ విశేషం జరిగినా మొదట తెలిసేది వాడికే! వాడి నోటనే.. మిగతా ఊరు వినగలుగుతుంది. పెళ్ళాం పిల్లలున్నా, రాములికి ఆకలేస్తే.. ఏ గుడిసెలోనో దూరి 'అక్కా అనో, 'వదినా' అనో వరు సలు పెట్టి కంచంలోకి తనే వడ్డించుకుం టాడు. బీడీ కావలిస్తే వాడొకల్ని అడగడు. ఎదుటివాడి జోబీలో చేతులెట్టి కట్టలోంచి బీడీ ఒకటి లాగి రెండు దమ్ములు తీసాకగాని మరోమాట ఉండదు. వాడికి తెలీని వ్యాజ్యాలు కేసులు లేవు. ఆకాశవాణి ప్రసారాల్లా ఎవరు విన్నా వినకున్నా వాడి వాగ్దాటి సాగిపోతూనే ఉంటుంది. వాడి చదువుకు కొందరు అసహ్యం చుకున్నా, వాడు చెప్పే కబుర్ల కాలక్షేపానికి అందరూ వాణ్ణి దగ్గరకు రానిస్తారు.

"ఏంది బావా! ఫరాఖత్‌గా కూ ర్చున్నావు" అంటూ పైకీ క్రిందికీ ప్రక్కలకు చూస్తూ పరిసరాల్ని సర్వే చేసాడు. ముతక లుంగీ, మోకాళ్ళ పైకి కట్టిన పంచ- రెండూ కంది రంగుకు మారాయి. పిచిక పిల్ల లాంటి నల్లటి చిన్న ఆకారం. సొట్టకాలు.

రాజాలు బదులు చెప్పకున్నా కాలు దగ్గర ఉన్న కుక్కపిల్ల రాములును 'కుఁయ్ కుఁయ్' మంటూ పలకరించి అతిథి మర్యాద చేయబోయింది. 'ఏహే నీ యవ్వ' రాములు డొక్క లో తన్నటానికి చచ్చుపడిన తన కాలుని లేపాడు. దెబ్బ తగల కపోయినా.. రాములు భావాన్ని అర్థం చేసుకున్న దానిలా దూరంగా పోయింది కుక్క.

"ఏంటి రాములూ! ఇట్లా దారి తప్పి వచ్చినవు?" రాజాలు ప్రశ్న.

"చానా రోజులయ్యింది నిన్నో సారి చూద్దామని బావా!" జవాబు.

"ఆహాఁ..' అంటూ రాజాలు వెటకారం. కాస్సేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

"బావా"! అన్నాడు రాములు. ఓసారి ఖాండ్రించి ఊసి గొంతు సర్దుకున్నాడు.

"ఊళ్ళోకి కట్టెకోతోళ్ళు వచ్చిండ్రు. పెద్దపెద్ద చెట్లను కొట్టుకుపోతున్నరు?"

"అయితే నాకేం!" అన్నట్లు విసుగుతో కూడిన రాజోలు చూపు రాములుకి జవాబు అయింది.

"పైసలిచ్చి కొట్టుకుపోతున్నారు బావా!"

పైసల మాట వినగానే రాజాలు దృష్టి రాములు వేపు మరలింది. నోట్ల కట్టలు వాడిముందు నాట్యం చేస్తూ కనిపించాయి. ఈ విషయం రాజాలు ఇదువరకే విన్నాడు. రెండు రోజుల్నుంచి ఊరంతా గుప్పుమంటోంది ఈ వార్త.

మళ్ళీ రాములే మాట్లాడాడు "పటేల్ సాబును కలుపుకున్నారట వాళ్ళు. ఆరేడు వేపచెట్లు అప్పుడే నేలకొరిగాయి. ఇంట్లో వేప చెట్టున్నవాడి పంట పండిందనుకో. పట్నంలో తలుపులూ కిటికీలు చేయిస్తున్నారట. ఒక్కో చెట్టు వేలల్లో పలుకుతోంది తెలుసా?" అన్నాడు.

రాజాలు మౌనాన్ని అంగీకారంగా తీసుకొని "దళానికి నీ చెట్టు గురించి చెప్పిన బావా! వస్తున్నడు" ఏదో తెలీని ఉద్వేగం ఆవేశించింది రాజాల్ని.

"కనీసం వేయి రూపాయలు కళ్ళజూడొచ్చు" అనుకున్నాడు రాజాలు. బలిసిన మేకపోతు వేపు యజమాని చూసినట్లు, కోతకు వచ్చిన పంటవేపు కామందు చూసినట్లు వేప చెట్టు వేపొకసారి చూసాడు. ఆకుల స్థానంలో వాడికి రూపాయి కాగితాలు అల్లల్లాడుతున్నట్లు కనిపించాయి. వేపరెమ్మలు పిల్లగాలుల్తో ఆడుకుంటున్నాయి. పలకరించగానే నవ్వులు ఒలకపోసే పసిపాపాయిలా వేపచెట్టు గలగలా నవ్వినట్లు అనిపించింది. కొమ్మల్లో కాకి ఒకటి ఏదో పోగొట్టుకున్నదానిలా పిచ్చెక్కినట్లు 'కావు కావు'మంటోంది. మధ్యలో నీ గోలేంటన్నట్లు ఓ రాయి తీసి విసిరాడురాములు.

×××

దూరాన ఓ నలుగురు దిబ్బ ఎక్కుతూ కనినించాడు. వాళ్ళను చూడగానే రాములికి ఉత్సాహం కట్టలు త్రెంచుకుంది. డబ్బు ఉంటే ఈ రోజుల్లో ఏం చేయగలరో, లేకుంటే "కుక్కలు కానని బ్రతుకు" అవుతుందని, అమ్మయినా అయ్యయినా డబ్బు తరువాతేనని, ఎక్కడెక్కడి వివరాలో సోదిపెడుతున్నాడు రాములు.

×××

అయిదు వందల్తో మొదలుపెట్టాడు దళారి గిడసబారిందన్నాడు. 'ముడను'లున్నాయన్నాడు. చివరకు పదిహేను వందలకు బేరం కుదిరింది.

అన్నేళ్ళూ అమ్మలా పొదువుకుని, గాలీ వానా, ఎండా, చలీ నుండి రాజాల్ని కాపా డుతూ వస్తూన్న ఆ వేపచెట్టు సాయం త్రానికల్లా నేలకు ఒరిగింది. "నేను నీకు చేసిన సాయానికి ఇదా ప్రతిఫలం?" అని వేపచెట్టు తనని ప్రశ్నించినట్లనిపించింది రాజాలుకి.

మొహం త్రిప్పుకుని దూరంగా కూర్చున్నాడు. అన్నీ తెలిసిన మనిషి మౌనంగా కూర్చున్నా, చెట్టు మీద కాపురం ఉంటున్న పిచుకలు, కాకులు, కొంగలూ.. ఒకటే గోల చేసాయి. తమ ఆప్తుణ్ణి లాక్కెడుతున్నట్లు అరుపులు. కూలిపడిన చెట్టు మీదే ఎగురుతూ.. వాటివాటి భాషల్లో సంతాపాన్ని ప్రకటించాయి.

పటేలుకు, రాములుకు, ఫారెస్టు వాడికి ఇలా ఎవరి వాటా వాళ్ళకు పోగా రాజాలుకు దక్కిం ది అయిదు వందలు. అమ్మని అమ్ముకున్న రాజాలు అయిదు వందల్ని రొంట్లో దోపు కున్నాడు.

కూలిపోయిన వాడి ఇంట్లో మిగిలిన సామాను సర్దుకోవటంలో నిమగ్నమయ్యాడు. అనుబంధం త్రెంపు కోలేని పక్షులు మాత్రం గోల గోలగా అరవటం మానలేదు.

1962లో రాసిన కథ



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## ఆత్మస్పర్శ

మనసు మౌనంగా దాచుకున్న భావాలను పదాల శ్వాసతో జీవింపజేసే ఆత్మస్పర్శే సాహిత్యాభిలాష

మనసు గర్భంలో నిశ్శబ్దంగా పెరిగే ఆలోచనలకు రూపం వస్తే అదే అక్షరాల జననం

కనిపించని అశ్రువుల కలం ధారకు కాగితం అందించే స్నేహ హస్తం, పలకని వేదనకే పదాల స్వరం అద్దం

స్మృతుల సుడుల్లో తిరిగే జ్ఞాపకాలు వాక్యాల తీరం చూపిస్తాయి

గాయాల మడతల్లో దాచిన బాధ కవితగా ఊపిరి పీల్చుకుంటుంది.

ప్రేమ మౌనమైతే గేయమవుతుంది, విరహం విలపిస్తే పద్యమవుతుంది.

ఆశ వ్యాసమవుతుంది, అనుభవమే సాహిత్యానికి మూలమవుతుంది.

సాహిత్యం రాజసభల కోసమే కాదు, పేద గుడిసెల గుండెల కోసమూ,

రాజ మార్గాల గొప్పతనమే కాదు, బాటసారుల బాటకూ వెలుగు.

కాలం చూపే అనుభవాలు అక్షరాల అమరత్వం చేస్తాయి, తరం తరం దాటే సత్యాల్ని పుస్తకాలు తెరుస్తాయి.

సమాజపు ముసుగుల్ని తొలగించి అన్యాయాలపై కలం నిలబెట్టి, మనిషి విలువను గుర్తుచేసే మౌన విప్లవమే సాహిత్యం.

ఎవరికీ కనిపించని మనసు చీకటి గదిలో ఒక దీపంలా వెలిగేది సాహిత్యాభిలాషే.

పలకని మనసుకి పలుకుబడి, వినబడని గొంతుకి స్వరం, తీరని తపనకే తృప్తి అక్షరాల సాధన.

కలమే ఆయుధమై, కాగితం యుద్ధభూమియై, సత్యమే విజయం సాధించే నిరంతర పోరాటం ఇది.

అందుకే శ్వాస ఉన్నంత వరకూ భావాలు కదులుతాయి, భావాలు ఉన్నంత వరకూ అక్షరాలు పుడతాయి,

అక్షరాలు ఉన్నంత వరకూ సాహిత్యాభిలాష జీవిస్తూనే ఉంటుంది.

**–శాంతలక్ష్మి మునిమడుగు**
+91 94404 23273

## మధుర కళ

సాహిత్యం అంటే
ఇష్టం లేనివారెవరు
అరువది నాలుగు కళలలో
సాహిత్యం కూడా వొకటి
కవిత వ్రాయడం
అంత సులభమేమి కాదు
కవికి, కవయిత్రులకు చక్కటి కవిత
వెలికి రావాలంటే
ప్రసవవేదన తప్పదు
ఎన్నో ఇబ్బందులు
అందులో చక్కటి పదబంధాలు
శబ్దాలంకారాలు
అర్థాలంకారాలు
అన్వయిస్తూ వ్రాయాలి
మన ఆత్మకు యితరుల హృదికి
యింపుగా వుండాలి
సందేశాత్మకంగా వుండి
సహృదయంగా
విజ్ఞానం అందించేవి యైన పిల్లలకు
యువతకు ఉపయోగం
ముఖ్యముగా పేరుపొందిన కవుల
రచనలు చదవాలి
ఆయా కాలాలకనువగు
రీతిలో రచించిన
సహృదయుల మన్ననలు
పొందుట తథ్యం
నిరంతరం పుస్తకాలు పఠిస్తూ
అర్థవంతమైన పదాలు
సేకరిస్తూ
మస్తిష్కంలో నిక్షిప్తం చేసుకొని
అద్భుతమైన
కవితలు కథలు గీతాలు
వివిధ ప్రక్రియల వెలువరించిన
కాలాన్ని సద్వినియోగం పరోపకారం
చేసిన వారిలో మనమే ముందు
వరుసలో వుంటాము
అనడంలో అతిశయోక్తికి ఆస్కారం
లేదుకదా... **-కే. శ్యామల దేవి**
+91 78932 29318

## సంపాదన కోసం పరుగులు

అందరినీ పుట్టించిన దేవుడు కొందరికే సుఖాలు
"కన్నీటి బ్రతుకు –రాత మరికొందరికి ?
అరక భుజానేసుకుని అర చేను... అలుపెరుగక...
దున్ని పంటలు పండించే... రైతన్నకు మిగిలేది ?
కన్నీటి వెతలు.
అన్నదాతకు అన్నమేకరువాయే !
గంజి మెతుకులు గొంతు దిగడమే గగనం .
మితిమీరిన సంపదలు కొందరికి....
అర కొర జీవితాలు మరి కొందరివి .
పుడమికి పచ్చ దన మిచ్చు వారి బ్రతుకు... ఎండిన ఎడారే !
వాతావరణం ప్రతికూలమైనా
ప్రకృతితో పోరాడే యోధులు రైతులు.
రైతాంగం లేనిదే లేదు.... మంత్రాంగం– యంత్రాంగం.
సంకల్ప బలంతో ఆత్మ శుద్ధితో అహర్నిశలు
కష్టించి పనిచేసే అన్నదాతలు.
కృషితో కృషీవలురు నైరాశ్యం వీడి అందరికీ ఆదర్శ ప్రాయులయ్యేరు .
సంపాదన పెంపుదలకై పరుగులు....పరుగులతో అలసట– ఆయాసం!
కడుపునిండా తినలేరు .
పేదవారు గజ్జి–మిరపకాయ–ఉల్లిపాయతిన్నాఆరోగ్యంగా నుండే!
తమకున్న దాంతో సంతృప్తి చెందుట యే వారి ఆరోగ్య రహస్యం
మానసిక ప్రశాంతత – తృప్తి ని మించిన సంపద ప్రకృతిలో లేదు ‘ .
ఆకలి – దప్పిక సర్వ ప్రాణులకు సమానం
**–కాదంబరి కృష్ణ ప్రసాద్**

## ఆకలి కేకలు తప్పేది ఎప్పుడో

ఆకలి తీరక కూలీలు వెళ్ళక
ప్రొద్దు జామునే సద్దన్నం తిని
నాగలి జీవితపట్టి ఉపోలం దున్నితే
వచ్చేది ఏ మాత్రం.
మండుటెండలో ఆకలి పోరాటం
చాలీచాలని బతుకులతో
కాలం గడిపేస్తూ
పొలిగట్లపై ముచ్చట్లు
అదే వాళ్లకు స్వర్గసీమ
ఏడంతస్తుల మేడలలో విందు
వినోదాల భోగం.
శ్రమించే కష్టజీవికి మట్టి వాసనలో
పచ్చడి మెతుకులే పరమాన్నం.
ఆకలి రుచిఎరగదు నిద్ర సుఖమెరుగదు
అన్నట్టు లేనివాడికి ఎటైనా గోదాే
కటిక నేలపైన అయినా సుఖంగా నిద్రిస్తాడు
పట్టుపరుపుల పై నిద్రించే వాడికి
ప్రశాంతతే కరువ
ఉన్నోడికి లేనోడు లోకువ
మేమేదైనా చేయగలమని అహం
కష్టించేది తనే అయినా నోరు విప్పరాదు
బిక్కుబిక్కుమంటూ పిల్లిలా ఓ మూలన
రైతన్నలే పట్టుకొమ్మలని తెలిసి
ధనవంతులు బేరసారాలాడుతూ
కష్టశ్రమను దోచుకుంటూ డబ్బు బలంతో
హోదాలను
పెంచుకుంటున్నార
ఎండైనా వానైనా
కష్టం తప్పదు
అప్పులు తీరిక
చెట్లకు ఉరిచావులే
నోరు తెరిస్తే దండనలు
బాటిల్ ఉంటే చాలు
బిర్యానీలతో మజా
చేసుకుంటారు
**–సుజాతకోకిల**
+91 9849108934

## బంధం

పయన ప్రపంచం
కన్నీటి వరదైనా
పన్నీటి మడుగైనా
అశాశ్వత బంధమే
వీడి పోయే రాతలే
అయినా ఎప్పటికప్పుడు
అర్థంలేని,విలువలేని వ్యామోహంతో,
స్వార్థమే మన పరమార్థం అనే వింత
భావనతో జీవితాన్ని
దీపం వుండగానే ఇల్లు
దిద్దుకోని విధంగా మనకు
మనం వృధా చేసుకుంటున్నాం
సాటి మనిషి
సాయానికి సాయ
పడే పరోప కారానికి మరింతగా
మనకు మనమే చిత్రంగా
దూరంగా జీవిస్తున్నాం
ఇప్పటి కైనా జీవిత
పరమార్థం తెలుసుకుని
నిజమైన మనిషిగా
మనం మారితే
మంచు వలె కరిగి పోయే
ఐశ్వర్యానికి
ప్రాధాన్య మీయక, శాశ్వతమైన
మానవత్వానికి
ప్రాధాన్యమొసగుదాం
ఆ ఆశయమే మన జీవితానికి
మేటి ప్రమాణం
భావి తరానికి మనమే
మరిక మార్గ దర్శకులం.
**–గాదే పల్లి మల్లికార్జునుడు**
900074965

## వి. పి.చందన్ రావు–కందాళై రాఘవాచార్య రచించిన
# "రెండు ఒకట్లు" జంట కవిత్వం ఆవిష్కరణ



వి.పి.చందన్ రావు – కందాళై రాఘవాచార్య కలిసి రచించిన జంట కవిత్వం "రెండు ఒకట్లు" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి.


వి.పి. చందన్ రావు –కందాళై రాఘవాచార్య కలిసి రచించిన జంట కవిత్వం **"రెండు ఒకట్లు"** కవితా సంపుటి రవీంద్రభారతిలో డిసెంబర్ 25న ఆదివారం ఆవిష్కరింపబడింది.

ముందు మాట రాసిన రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ఏనుగు నరసింహా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జంట కవుల కవితా కృషిని సంపుటి లోని కవితల విశేషాలను వివరించారు.

ప్రజాకవి డా॥నందిని సిధారెడ్డి "రెండు ఒకట్లు" ఆవిష్కరించి చందన్ కందాళై రాసిన కవితల గురించి ఇందూరు భారతి సాహితీ సమాఖ్య కృషి గురించి వివరించారు. ఇంకా డా॥నాళేశ్వర శంకరం జంట కవులు కందాళై చందన్ తో తనకు గల అనుబంధాన్ని వివరించారు. డా॥రావ్ కుమార్ డబ్బీకర్ విశ్లేషించారు. శారదా హనుమాండ్లు, బి.చంద్రశేఖర్ రావు, బెల్లంకొండ సంపత్ కుమార్ మాట్లాడారు.

ఈ "రెండు ఒకట్లు" సభకు కందుకూరి శ్రీరాములు సభాధ్యక్షత వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. వచ్చిన ప్రేక్షకులకు "రెండు ఒకట్లు" పుస్తకాలను అందజేసి లోకవ్యాప్తం చేసారు.

# 'మహాభారతం' నానీలు ఆణిముత్యాలు




ప్రతులకు:
చెట్టు కవి జంజం కోదండరామయ్య
జమ్మిపాళెం, ఇనమడుగు.పి.ఓ
కోవూరు (మం),
నెల్లూరు.జిల్లా–524 137
సెల్: 8985938861

'చెట్టు' కవిగా సాహితీ లోకానికి పరిచయమైన "జంజం కోదండ రామయ్య" అలతి అలతి పదాలతో చిక్కనైన కవిత్వాన్ని నానీల రూపంలో ఇప్పుడు మనకు అందించడానికి ముందుకొచ్చారు. "మహా భారతం" నానీలు సంపుటిని ప్రకటించి తమ సృజనను చాటుకున్నారు.

**"దాశరాజు సుత
మత్స్యగంధి
నావ నడుపగా
అందున్నాడు పరాశరుడు"**

అంటూ అపురూపమైన నానీలో చెప్పాడు కవి.

**మగనికి
లేదని చూపు
గాంధారి
కనులకు గంతలు కట్టె"**

అంటూ నానీలో రాశారు కవి ఇది నిజమే కదా! గుప్పెండు అక్షరాలతో కొండంత భావాన్ని జంజం చెప్పారు.

**"అందం
దేవుడిచ్చిన వరం
బాధించింది
ద్రౌపదిని నిరతరం"**

అందం దేవుడిచ్చిన వరమైతే ఆ అందం ద్రౌపదికి నిరతరం బాధ అంటూ కవితాత్మకంతా చెప్పిన తీరు బాగుంది.

**"భగవత్ గీత
పవిత్ర గ్రంథం
అది జీవునకు
దేవునకు గల బంధం"**

అంటూ భగవత్ గీత గొప్పదనాన్ని చక్కగా ఆవిష్కరించారు కవి.

**"పంచమ వేదం
మహా భారతం
అందులో లేనిది
ఉండదు మన జీవితం'**

అంటూ సున్నిత భావాలను మాధుర్య శైలిలో అందించడంలో సఫలీకృతులయ్యారు జంజం.


"మహా భారతం" నానీలు ఇటువంటి మంచి పుస్తకాన్ని అందించిన ప్రముఖ అధ్యాత్మికవక్త, రచయిత, కవి అయినా "జంజం కోదండ రామయ్య" అభినందనీ యులు.



**–కాళహస్తి వెంకట శేషగిరిరావు**
9849619628


## మట్టిమహత్యం

దేశమంటే మట్టిరా
మనుజులుండే తావురా
మట్టిపైపడితే జననంరా
మట్టిలోకలిస్తే మరణంరా.
మట్టి మనతల్లిరా
మట్టి మనదేశంరా
మట్టి మనసస్యశ్యామలంరా
మట్టి మనపోషణద్రవ్యంరా.
మట్టి మనల్ని మోస్తుందిరా
మట్టి మనల్ని
అడుగులేయిస్తుందిరా
మట్టి మన ఆస్తిరా
మట్టి మన ఇల్లురా.
మట్టంటే మురికికాదురా
మట్టంటే బురదకాదురా
మట్టి సుజలంరా
మట్టి సుఫలంరా.
మట్టి మొక్కలపెంచురా
మట్టి పచ్చదనమిచ్చురా
మట్టి ఖనిజాలగనిరా
మట్టి రత్నాలగర్భరా.
మట్టి మన ఆరంభంరా
మట్టి మన అంతంరా
మట్టి భూదేవిరా
మట్టి మహతిరా.



**–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్: 7981616630

# కవితా గోదావరి–కాశీ అన్నపూర్ణ




ప్రతులకు:
గరిమెళ్ళ కాశీ అన్నపూర్ణ
సెల్: 9618586277

**గరిమెళ్ళ కాశీ అన్నపూర్ణ కవితా సంపుటి "గోదావరి పరవళ్ళు" పుస్తకానికి చిట్టిప్రోలు సుబ్బారావు రాసిన ముందు మాట..**

ఆకివీడులో పుట్టిన అన్నపూర్ణగారు రాజమండ్రి లోనూ హైదరాబాద్‌లోనూ చదువుకున్నారు. రమేష్ గారితో వివా హం జరిగిన పిదప పిల్లల్ని చూసుకోవా లని ఉద్యోగం మాని భర్తకు ఉన్నత ఉద్యోగావకాశం రావడంతో స్వదేశాన్ని వీడి విదేశాల్లో కొంత కాలం నివసించారు.

ఇద్దరు కూతుళ్ళు అమెరికాలో పెద్ద చదువులు చదివి వివాహాలయ్యి వారి వారి అభిరుచులకు తగ్గట్టు జీవితాలను తృప్తికరంగా జీవిస్తున్నారు.

మొన్న మొన్నటి దాకా ఆమె ఒక సాధారణ గృహిణి. ఇకపై కాదు. ఆమె జీవితం ఇప్పుడు రెండు అధ్యాయాలైంది:

స్వర రాక మునుపు– స్వర వచ్చాక...

స్వర ఆమె మొదటి మనుమరాలు.. భర్త గానీ, కూతుళ్ళు గానీ చేయని మాయను మనుమరాలు చేసింది. అమ్మమ్మతో అవలీలగా ఒక ఆశు పద్యం పలికించింది. ఆ కవిత ఈ సంపుటంలో మొదటి కవితగా **'నా కరములకందని దూరంలో'** వెలుగు చూసింది.

ప్రతి కవీ ఆదికవి కాలేదు. కానీ స్పందించే ప్రతి హృదయానికీ ఒక ఆదికవిత ఉంటుంది. ఇక కవిగానో కవయిత్రిగానో ఆ మనిషి ప్రయాణం మొదలవుతుంది. సాధారణ గృహిణిని కవయిత్రిగా మలచిన ఈ సంపుటం అలాంటి ఒక ప్రయాణానికి శ్రీకారం. తన సాహితీ ప్రస్థానంలోని మొదటి అడుగుకు ప్రేరణ స్వర.

అరంగేట్రం నాడే అద్భుతాలు ఆవిర్భవించవు. కానీ భవిష్యత్ సూచికలు కనిపిస్తాయి. కవయిత్రి రచనాశక్తికి ఆనవాళ్ళుగా భావింవదగ్గ కొన్ని మెరుపులను ఉదహరిస్తూ పాఠకుల్ని నాతో కలిసి ఆ కవితలను ఆలకించిండని ఆహ్వానిస్తాను.

**'అక్షరలక్షలు'** అనే కవితలోని ఈ పంక్తుల్ని చూడండి..

**'సూర్యకాంతికి జోడుగా
అక్షరకాంతి నాకు ఎప్పుడూ
తోడుగానే ఉంటుంది
నేను పెద్దగా చదువుకోలేదు కానీ
చిరు చిరు సాహిత్యపు చినుకుల
సాయంతో
అక్షరసేద్యం మాత్రం చేస్తుంటాను!**

పరిణత కవి వాక్యాల్లా, అక్షరలక్షలు విలువగల కవితా పంక్తులివి. కవితా ప్రపంచంలోకి ప్రవేశిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించుకున్నట్లు కనిపిస్తాయి ఈ అక్షరాలు.

వివిధ సామాజిక అంశాలకు స్పందించే గుణమున్న ఈ కవయిత్రికి– **'కాశీ అన్నపూర్ణ'** అనే తన పేరుబలం వల్లనో ఏమో ఈమెకు దైవచింతన కూడా ఎక్కువే. భక్తి కవిత్వంలో కూడా గాఢమైన భావుకత కనిపిస్తుంది. అటువంటి ఒక కవిత–

**'కొద్దిగ నను దిద్దవయా!'** శీర్షికలో ఎంత ఆర్తి కనిపిస్తుందో కింది పంక్తుల్లో అంత భావ శబలత కనిపిస్తుంది.

తప్పుల తుప్పుపట్టిన ఈ తోలుతిత్తిని
కాటికాడికి వచ్చి ఎలాగయ్యా నీకు
అర్పించేది!

భగవంతుడికి తనను తాను పరమ పవిత్రంగా సమర్పించుకోవాలని కాంక్షిస్తాడు ఇక్కడి భక్తుడు. కానీ జీవితంలో తప్పులు చేసి తన దేహం తుప్పు పట్టిందని చింతిస్తాడు. **'తప్పుల తుప్పు'** అనే పదబంధం కొత్తగా, అర్థవంతంగా ఉంది.

**'పోష్ ఏరియా'**లోని ఇక్కడ మనుషులు తక్కువ పని మనుషులెక్కువ మాటలు అసమానతల మీద చురుకైన వ్యాఖ్యానంగా వినిపిస్తాయి.

కనుల వెనుక కపటాన్నీ మనసు మాటున మృగాన్నీ పోషిస్తున్న ఈ కలికాలపు రావణాసురులది ఎంత కండకావరమమ్మా! అంటూ స్త్రీల మీద జరుగుతున్న అత్యాచారాలకు చలించిపోయి ప్రశ్నిస్తారు **"ఏమిటీ ఆచారాలు!"** కవితలో.

పర్యావరణానికి ప్లాస్టిక్ చేస్తున్న చేటు క్రమంగా అందరికీ అర్థమవుతోంది. **'ఇందుగలడందు లేడని సందేహము వలదు'** ఇది పోతన గారి భాగవత పద్యపాదం. నేల మీద అడుగడుగునా దేవుడు కనిపిస్తాడో లేదో గానీ ప్లాస్టిక్ మాత్రం కనిపిస్తుంది. ప్రజలూ, పరిశ్రమలూ, ప్రభుత్వాలూ సమస్యను సమగ్రంగా పరిష్కరించడం లేదు. ఇక ప్లాస్టిక్ పూలు శాశ్వతమైనవనీ, సహజమైన పూలు క్షణభంగురాలనీ సమర్థించుకుంటూ తనను తాను మోసగించుకుంటున్న మనిషిని చూసి అన్నపూర్ణ గారు దిగులువడే కవిత **'పర్యావరణం మన ప్రాణం'.**

**ప్లాస్టిక్ పూవులే పదికాలాలుంటాయనీ
పరిమళించే పూలు వాడిపోతాయనీ
పరిమళించని మనసులు ఆలోచిస్తుంటే..**

ఇక్కడ ఉటంకించిన మాణిక్యాల లాంటి పద్యాలూ భావాలూ ఈ సంపుటిలో చాలా ఉన్నాయి. తవ్వి తీయమని, తడిమి చూడమని పాఠకులను అభ్యర్థిస్తున్నాను.

పాఠకులు **'మంచి కవిత్వం'** చదవామని అభి నందిస్తే రచయిత్రి ఆనందిస్తారు. కానీ **'మా అమ్మ మ్మ కవయిత్రి'** అని మనుమలూ మనవరాళ్ళూ మురిసిపోతే అన్నపూర్ణ గారు మరింత పొంగిపోతారు.

తన భర్త రమేష్ గారు రాసిన కవితనూ, పదమూడేళ్ళ బాలికగా కుమార్తె అరవింద రాసిన కవితనూ, తమ్ముడు శ్రీనివాసమూర్తి కవితా సం కలన ముఖచిత్రాన్నీ ఈ సంపుటిలో అనుబంధంగా చేర్చి, కుటుంబమంతటా ప్రసరిస్తున్న సాహిత్య సౌగంధాన్ని పాఠకులకు చూపించారు కవయిత్రి. ప్రథమ కృతిని అత్తమామలకు అంకితమిచ్చి తన వినమ్రతను చాటుకున్నారు.

పిల్లలు విదేశాల్లో, తల్లిదండ్రులు స్వదేశంలో, ఇదీ ఈనాటి మధ్యతరగతి భారతం! ఆర్థికపరమైన వెసులుబాటు చేకూరిన పెద్దలు కొందరు తీర్థయాత్రల్లో, వినోదపర్యటనల్లో కాలక్షేపం చేస్తుంటే, అన్నపూర్ణ గారు కవితా సేద్యం లోనూ ఆమె భర్త రమేష్ గారు విద్యా బోధనలలోనూ వారి జీవితాలను గడపడం ముదావహం.

కొంత ఆలస్యంగా లభించిన తీరుబడిలో అన్నపూర్ణ గారు తన మనసుకు నచ్చిన కవితా సేద్యంలో మరింత కష్టపడి మరిన్ని పంటలు పండిస్తారని ఆశిస్తున్నాను.



**–చిటిప్రోలు సుబ్బారావు**
సెల్: 9701049000



నిర్వహణ
**–కందుకూరి శ్రీరాములు**
**–బెల్లంకొండ సంపత్ కుమార్**

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

## ప్రేరణ

కాలరాత్రి కాలమంతా
గడిచాకే ఉషోదయం!
ఆకురాల్చు శిశిరం వెనుకే
వస్తుంది వాసంతం!
కళ్ళలోన కదిలే స్వప్నం
కళ్ళ ఎదుట నిలిచే సమయం
రానుందోయ్ రాజీ పడకు
రాలేదని రంది పడకు!.
వేలకొలది శిలలున్నా
శిల్పంగా.. మారేది కొన్నీ!
సముద్రం నిండా నీరున్నా
మేఘంలా మారేది కొంతే!
లక్ష్యాన్ని లక్ష్య పెడితే
లక్ష మంది నీ తరువాతే!.
**– ఆదిత్య కైరం కొండ**
8790771348

## కొందరికి మాత్రమే

ఏంటమ్మా! వాగ్దేవి వింటున్నావా ?
ప్రతిభ లేకున్నా పైసలుంటే చాలు
జీవిత ఖాతాలో చేరునొక పురస్కారం
డబ్బులుంటే ముంచెత్తు బిరుదుల వరదలు
ఎందుకంటే అక్కడ అవార్డులు అమ్మబడును
వారికి ఎవ్వరి ఘనత తో పనిలేదు
వారికి ముట్టె ధనం తోనే పని
పచ్చనోటు పసిడి కాంతి వెలుగులో
అసలైన సేవలు అస్సలు కనపడవు
దారి తప్పిన లెక్కలు చెప్పని చిట్టాలు
ఎన్నో ఉన్నాయి
చిల్లరపైసల కోసం
అమ్మిన నకిలీ గుర్తింపుల తాలూకు
బదిలీల మరకలు సాక్షమైనాయి
ఎందుకంటే కాలం
ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉంది
అసలు గౌరవ పురస్కారం ఇవ్వడం అంటే
సుకవిలోని సాహిత్య దేవతవైన
నిన్ను తట్టి లేపి నీకు
భక్తి అనే కిరీటాన్ని
అలంకరించి తన్మయత్వం చెందడమే కదా
ఇక్కడ
పాపం వారు ఇంకా ఎన్నాళ్లని
చిరిగిన విలువల వలువలు ధరిస్తారో
ఇంకా ఎన్నేళ్ళని
అతుకుల బొంతను అలంకరిస్తారో
ఇంకా ఎంతకాలం
వ్యక్తిత్వాన్నీ తాకట్టు పెడతారో
ఈ కవిత ఒక కనువిప్పు కావాలి !
**– హరి ప్రసాద్**

## ఏది గొప్పది ?

అంతా మట్టే !
ప్రాణం కన్నా మిన్న
ప్రపంచంలో ఏమున్నది?
మట్టిలో పుట్టి
మట్టిలో పెరిగి
మట్టిలో కలిసిపోయే ప్రాణికి
మహిమ ఏమున్నది?.
అంతా మాయా
అంతా మిధ్యా అనుకున్నా.
అవనీ చక్రము తిరుగుతునే ఉన్నది
సూర్య గోళం మండుతునే ఉన్నది
నీటిధార ప్రవహిస్తూనే ఉన్నది
గాలిదుమారం వీస్తూనే ఉన్నది
ఆకాశం అంతెత్తున్నా చూస్తూనే ఉన్నది.
వీటి మధ్య ప్రాణి రూపమై
పుడుతూనే ఉన్నది
మెల్లమెల్లగా శివమెత్తి పెరుగుతూనే ఉన్నది.
చెట్టుకు నీరు ప్రాణమైనట్టు
ప్రాణికి రక్తం ప్రాణాతి ప్రాణం !.
రక్తం కావాలి రక్తం !
దేహంలోంచి దేహంలోకి బతుకై పరుగెత్తాలి !
స్పృహ కోల్పోయిన జీవచ్ఛవం
పునర్జన్మ పొందాలి. !
అప్పుడు
ప్రాణికి ఒక ప్రాణి అమృతస్నేహహస్తం రక్తం !.
అప్పుడు
ప్రాణికి ఒక ప్రాణి సంజీవని
ప్రాణస్నేహం రక్తం !!
**– కందుకూరి శ్రీరాములు**
9440119245



పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

"వారం వారం కవితల వర్క్ షాప్" 48 కి మొత్తం 20 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 3 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

**–డా॥రావి రంగారావు**
9247581825

## అసలు గుడ్డివాళ్ళు


సత్యం ధర్మం అనే
రెండు కళ్ళతో వికసితమౌతూ
అన్యాయాలను అక్రమాలను
వేలెత్తి చూపకపోతే
జ్ఞానం లేని గుడ్డివాడివే!.
శాంతి ప్రేమలు నీ హితులుగా
బతుకు తోటలో నాటుకొని
మురికి పట్టిన ఈర్ష ద్వేషాలను
కూకటివేళ్ళతో తుంచకపోతే
విజ్ఞానం లేని గుడ్డివాడివే! .
క్షమ దయలు దివ్య ఔషధమని
సాటి వారికి అందిస్తూ
విపరీత మనోబుద్ధులను
బూడిద చేసి
భగవంతునిలో చేరకపోతే
సుజ్ఞానం లేని గుడ్డివాడివే!.
ఓర్పు నేర్పులు చక్కనిరహదారులని
ముందు తరాలకు పరుచుకుంటూ
స్వార్థాన్ని అసమానతను
గునపాలతో గుచ్చకపోతే
అవ్యక్త జ్ఞానం లేని గుడ్డివాడివే!.
కరుణ జాలి తోడునీడలని
సద్గురువై బోధించి
ఆశని అత్యాశని కాల్చి చూపకపోతే
తత్వజ్ఞానం లేని గుడ్డివాడివే!
**–చల్లా సత్యవతి,**
పల్నాడు

## గ్రుడ్డి వారు

సమాజంలో
సాక్షాత్కరిస్తారు
రకరకాల గ్రుడ్డి వాళ్ళు...
కళ్ళుండి చూడలేని
గ్రుడ్డి వాళ్ళు...
వ్రేళ్లనే కళ్ళు చేసుకొని
చూసే గ్రుడ్డి వాళ్లు...
రోడ్డు దాటేందుకు
చేతి కర్రనే దిక్సూచిగా
వాడే గ్రుడ్డి వాళ్లు...
అంగ, అర్థ,
అధికారాల వల్ల
కళ్ళు తలపైకి ఎక్కడం
వల్ల
ఎదుటివారు కనిపించని
గ్రుడ్డివాళ్లు...రాజకీయ
పార్టీల పని తీరు చూసి
"గ్రుడ్డి కన్నా మెల్ల మేలు"
అన్న సామెత
ప్రతిసారి స్మరణకు వస్తారు
గ్రుడ్డి వాళ్లు..
మెల్ల కన్నుల వాళ్ళు...
బ్రెయిలీ లిపిని చదివి, వ్రాసి
పోటీ పరీక్షలలో నెగ్గి ,
ఉన్నత
పదవులలో రాణిస్తున్న
గ్రుడ్డివాళ్ళు ఎందరో!
అందరికి వందనాలు .!
**–నంద్యాల లక్ష్మా రెడ్డి,**
హైద్రాబాద్

## కాంతిరేఖలు

గుడ్డివారిని చూసస్తూ... ఎన్నో
భావాలు
కొందరు జాలిపడుతున్నారు,
కొందరు బాధపడుతున్నారు,
కొందరు అయ్యో పాపం
అనుకుంటున్నారు...
కొందరు ఏదో పాపం చేసుంటారులే
అనుకుంటున్నారు
వారంతా చూపులేని గుడ్డివారే,
చూపుండీ గుడ్డివారు ఎందరో?.
కొందరికి తామే
మనిషిగా కనిపిస్తుంటారు
వారంతా మనిషిగా గుడ్డివారే,
కొందరికి ఎదుటివారి బాధే ఆనందం
వారంతా సమాజంలో గుడ్డివారే,
కొందరికి హింసే బ్రతుకుతెరువు
వారంతా ప్రేమలో గుడ్డివారే,
కొందరికి అవినీతే నడవడి
వారంతా బాధ్యతలో గుడ్డివారే,
కొందరికి మోసగించటమే పెట్టుబడి
వారంతా ప్రపంచానికి గుడ్డివారే,
కొందరికి మోసపోవటమే అలవాటు
వారంతా లోకానికి గుడ్డివారే,
కొందరు వారికివారే బరువు
వారంతా కళ్లున్నా గుడ్డివారే,
ఇంతమంది గుడ్డివాళ్లను చూస్తుంట
చూపులేని గుడ్డివారు
చీకటిలో నడిచే కాంతి రేఖలు.
**–శ్రీఅరుణం శ్రీనివాస్.** విశాఖపట్నం



# కమ్మటి తెలంగాణ పరిమళం

**ఏ భాషకు ఆ భాష విశేషమైంది. ప్రత్యేకమైంది. గొప్పది. ఎవరిభాష వారికి ప్రాణం. ఆత్మసమానం. వాసన, రుచి కమ్మనిది. తెలంగాణ తెలుగు ఏ ఇతర తెలుగుల కంటె తక్కువ కాదు. తెలుగెంత తీయనిదో తెలంగాణ మాట అంత తీయనిది.**

**ఎస్. సంపత్ కుమార్ రచించిన తెలంగాణ పల్లె పదాల పరిమళం గ్రంథానికి డా॥ నందిని సిధారెడ్డి రాసిన ముందు మాట**




– డా॥ నందిని సిధారెడ్డి
సెల్:9440381148

మానవజాతి వికాసంలో భాష అద్భుతసృష్టి మనిషిని మరో మనిషితో అనుసంధానం చేసే ప్రక్రియగా రూపొందిన భాష రానురాను వివిధ భాషలుగా, విభిన్న అంశాలుగా, విశేష సంపదగా విశ్వరూపం సంతరించుకున్నది. భాష కేవలం అనుసంధానం దగ్గరే ఆగిపోలేదు. తరతరాల జ్ఞాన భాండాగారమంతా భాషే అయింది. యుగయుగాల అనుభవ పరంపర అంతా భాషలో అంతర్భాగమే. ఖండాల నడుమ, దేశాల నడుమ, ప్రాంతాల నడుమ, సంస్కృతుల నడుమ నిరంతరంగా కొనసాగుతున్న అవిచ్ఛిన్న ప్రసారధార భాష.

ఏ భాషకు ఆ భాష విశేషమైంది. ప్రత్యేకమైంది. గొప్పది. ఎవరిభాష వారికి ప్రాణం. ఆత్మసమానం. వాసన, రుచి కమ్మనిది. తెలంగాణ తెలుగు ఏ ఇతర తెలుగుల కంటె తక్కువ కాదు. తెలుగెంత తీయనిదో తెలంగాణ మాట అంత తీయనిది. సంకుచిత స్వభావులు భాషల్లో తక్కువ ఎక్కువలు చూస్తారు. స్వీయ ఉన్నతి కోసం ఇతర భాషలను, ఇతర యాసలను అవహేళన చేస్తుంటారు. అటువంటి ఆధిపత్య ధోరణుల మీద తిరుగుబాటు ప్రకటించి, గెలిచి నిలి చిన భాష తెలంగాణ భాష, తమ తమ ప్రాణభాషల అస్తిత్వం కోసం తమ ప్రాణాలే బలిపెట్టి ఉద్యమించిన నేపథ్యాలు ప్రపంచంలో అనేకం కనబడుతాయి. అట్లా ప్రాణాలర్పించి ఆత్మ గౌరవ పతాకను ఎగురవేసిన భాష తెలంగాణ భాష, ప్రామాణిక భాష, పేరిట సృష్టించిన మాయాజాలాన్ని పటాపంచలు చేసి తన ప్రత్యేకతను, ప్రామాణికతను నిరూపించుకున్నది తెలంగాణ తెలుగు.

తెలంగాణ పల్లెపదాల పరిమళాన్ని ఆస్వాదించి, పరవశించి, పరి శోధించి పూలు పూలుగా పుటలకెత్తుతున్న రచయిత ఎస్. సంపత్ కుమార్ శ్రీవత్స, మూడు వేల పదాలకు పైగా సేకరించి, ఇరవయ్యారు భాగాలుగా వింగడించి సంపత్‌కుమార్ రూపొందించిన పుస్తకం **"తెలంగాణా పల్లె పదాల పరిమళం."** ఒకరకంగా ఇది జానపద విజ్ఞాన కదంబం. అకారాది క్రమంలో తెలంగాణ పదాలు, వాటి అర్థాలు ఉన్నాయి. అందువల్ల ఇది పదకోశం. పదాలపుటల కింద సామెతలున్నాయి. విడిగా జాతీయాలున్నాయి. ఉర్దూ, లంబాడీ, ఎరుకల భాషల పదాలున్నాయి. మంథెన, వేములవాడ, ధర్మపురి, హైదరాబాదీ యాసల తెలుగు ప్రత్యేకతలున్నాయి. అందువల్ల ఇది మాండలిక శోధన. తెలంగాణలోని ఆభరణాలు, సబ్బండ వర్ణాల కులవృత్తుల పనిముట్లు, పండు గలు– పబ్బాలు, పల్లీయుల ఆటలు వంటి వున్నాయి. కనుక సాంస్కృతిక. యక్షగానం, చిరుతల రామాయణం, ప్రజల పాటలు, బాల గేయాలు ఉన్నాయి. కనుక సాహిత్య సంకలనం. పశువుల వైద్యం, చిట్కా వైద్యం, వాటివల్ల వైద్యవిశేషం. వ్యవసాయం, ధాన్యం కొలతల వల్ల ఇది వ్యవసాయ కోశం అక్కడక్కడ వ్యాకరణాంశాల చర్చ, తత్సమ, తత్భవాల చర్చ ఉండటం మూలంగా వ్యాకరణం. ఇటువంటి అనేకానేక అంశాలు గుది గుచ్చి ఉండటం వల్ల ఈ పరిశోధనా గ్రంథం **'తెలంగాణ జానపద విజ్ఞాన కదంబం.'**

**'భాష పుట్టిన తర్వాత వ్యాకరణం గానీ, వ్యాకరణం తర్వాత భాష పుట్టలేదు'** (పు. 5) అన్న స్పష్టత ఉన్నందువల్ల








ప్రతులకు:
-ఎస్.సంపత్ కుమార్
సెల్: 9346435123

సంపత్‌కుమార్‌కు శాస్త్రీయ దృష్టి ఉన్నదని తెలుస్తుంది. కొన్నిసార్లు తెలంగాణ పదాలను వింగడిస్తూ గోదావరి జిల్లాల, రాయలసీమ జిల్లా ల పదాలతో తులనాత్మక పరిశీలన చేసి తెలంగాణ ప్రేమను ప్రకటిం చాడు. ఉర్దూ క్రియలు తెలుగు ఇం చుక ప్రయోగాలు కలిసి తెలంగాణ భాషాక్రియా పదాలుగా గుర్తింపు పొందిన తీరు సంపత్‌కుమార్ వివ రించాడు. ఉడాయించుడు, కమాయించుడు వంటి ప్రయోగాలు ఆసక్తికరంగా తోస్తాయి. పత్రికాభాషను పరిశీలించి దాదాగిరి, బేజార్ వంటి ఎన్నో ఉర్దూ పదప్రయోగాలు ప్రత్యేకంగా చర్చించటం మనల్ని అకర్షిస్తుంది. ప్రజలను పాఠకులను ఆకట్టుకోవ టానికి జన వ్యవహార పదాలు వాడతారని, ఆ పదాల వల్ల వాక్యానికి వన్నె వస్తుందని రచయిత పేర్కొన్నారు.

సంపత్ కుమార్ వివేచించిన ప్రతి వ్యాసంలో తెలంగాణ ప్రేమ ప్రతిబింబిస్తుంది. రచయిత అంతరంగం నిండా తెలంగాణ తనం మమే కమై వాక్యాల్లో **'వాన పడ్డప్పుడు తడి సిన మట్టివాసన, కమ్మటి వాసన'** గుబాళిస్తుంది. సంపత్‌కుమార్ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు గట్టెపల్లి మురళి కుమారుడు. యోగా నిపుణుడు. అక్షర నిబద్ధుడు. తెలం గాణ స్వాప్నికుడు. కనుక **'తెలంగాణ గ్రామాల్లో నివసించే భాషా పదాలను పరిచయం పదాలను పరిచయం చేయగలగటం అదృష్టంగా'** (పు. 8) భావించాడు. సంపత్‌కుమార్ ఇంటి వాతా వరణం, పల్లెటూరి సాంస్కృతిక వాతా వరణం, పుస్తక పఠనం, జానపద కళల వీక్షణం ప్రేత్యకమైనవి. అవన్నీ సంపత్‌కుమార్‌ను అభిరుచిగల అక్షరజీవిగా మలిచాయి. సృజన తలెత్తింది. అనుశీలన ఆవహించింది. అతని అభిరుచి విశేషాల ఫలితమే ఈ పరిమళం.

అగ్గువ, అర్రెంల వెనుక **'అగడు వద్ద పోచమ్మ మొగన్ని మింగి'**నా, ఇసిరె, ఇకమతుల తర్వాత 'ఇల్లు ఇర్కటం ఆలి మర్కటం'గా మారినా, ఎకువాలు, ఎగ్గిలి కొసన **'ఎన్నబెడితె నాకడు–ఏలువెడితె సీకడు'** అన్నా, కైలాట్కం, **'కమ్మి'** అయి **'కడుపుల లేంది కావలిచ్చుకుంటె వస్తదా'** అను కొన్నా పుటపుటలో పుటం పెట్టినా తెలంగాణ గుణం అలంకరించింది. సందర్భానుగుణంగా సంపత్ కుమార్ సంపత్‌కుమార్ తెలంగాణ తనం అల్లుకున్నది.

సంపత్‌కుమార్‌ది స్వచ్ఛమైన ప్రేమ. తెలంగాణ అభిమానం ఎంత ఆవహించినా, స్థానిక యాసపట్ల భావోద్వేగం ఎంత ఉప్పొంగినా మిగతా యాసల్ని న్యూనపర్చలేదు. రచయిత ఔన్నత్యానికిది మంచి నిదర్శనం. 'ఏ యాస అయినా, దాని సౌరభాన్ని, సౌందర్యాన్ని మాట్లాడేవారి మనో నైర్మల్యాన్ని, కమ్మదనాన్ని, భావాన్ని ఆస్వాదించాలి (పు. 8)' అని భావి స్తాడు. అది ప్రజాప్రేమికులందరికీ తప్పనిసరిగా ఉండవలసిన భావన. ఉత్తమమైన భావన. **'మాట్లాడేవారి మనోనైర్మల్యం'** ప్రధానం. అటువంటి నిర్మలత్వంతో పరికిస్తే అన్ని యాసలూ కమ్మటివే. అన్ని భాషలూ సౌందర్య భరితమే. ప్రజల మనసు ముఖ్యం. దేని పరిమళం దానిదే. దేని సొగసు దానిదే. విశాలమైన ప్రజాస్వామికమైన భావన. నిజార్థంలో ప్రతి భాషా రసోచితమే. ఆస్వాద యోగ్యమే. అంతటి సమభావనతో, రసోద్వేగం తో, మనో నైర్మల్యంతో **'తెలంగాణ పల్లెల మల్లెల పరిమళం'** ఆస్వాదిద్దాం. రూపొందించిన సంపత్ కుమార్ శ్రీవత్సను మనఃపూర్వకంగా అభినందిద్దాం..



# వక్రీకరణలను సరిచేస్తున్న చరిత్ర

సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు దాదాపు రెండు నెలల క్రితం ఫోన్ చేసి తను రాస్తున్న **"భారత స్వాతంత్ర్యోద్యమం: ఆంధ్ర ముస్లిం యోధులు"** పుస్తకానికి ముందుమాట రాయమని కోరినపుడు దాన్నొక అరుదైన అవకాశంగా భావించాను. నశీర్ అహమ్మద్ గారు కొంత కాలంగా తెలుసు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సభల్లోనూ, ఇతర సమావేశాల్లోనూ కలిశాం. కలిసినప్పు డు ఆయన గురించి తెలుసుకున్న దానికన్నా పాతికేళ్లుగా స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వేర్వేరు కోణాల్లో ఆయన ఆవిష్కరిస్తున్న వైనం గురించి విన్నదీ. ఆయన రాసిన పుస్తకాలు కొన్ని చదివి తెలుసుకున్నదీ ఎక్కువ. విస్మరణకు గురైన విభాగాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా దీర్ఘకాలం శ్రమిస్తే అద్భుత ఫలితాలు సాధించ వచ్చని నశీర్ అహమ్మద్ గారు రుజువు చేస్తున్నారు.

వర్తమానం గతంగా మారిన తర్వాత చరిత్రగా పునర్నిర్మింపబడేటపుడు కొన్ని ఇటుకలు ముక్కలైపోతాయి. కొన్ని మరుగున పడతాయి. కొన్ని ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షించబడతాయి. అందువల్ల చరిత్రలో ఖాళీలు ఏర్పడతాయి. వాటిని గుర్తించటం ముఖ్యం. నింపటం మరీ ముఖ్యం. నింపేకొద్దీ కొత్త ఖాళీలు ఏర్పడుతూండడం చరిత్రకుండే గమనశీలతను చెబుతుంది. అంతేకాదు, ఎప్పటికప్పుడు కొత్త దృక్కోణాలు మొలుచు కొచ్చి నిర్ధారించుకున్న వ్యాఖ్యానాల మీద సవాళ్లు విసురుతూ ఉంటాయి. ఫలితంగా చరిత్ర తిరగ రాయబడుతూ ఉంటుంది. ఒక్కోసారి ఇప్పటిలా చరిత్ర రాజకీయాల పాలబడి వక్రీకరణకు, దుర్వ్యాఖ్యానాలకు గురౌతుంది. వర్తమానాన్నీ, తద్వారా భవిష్యత్తునీ చేజిక్కించుకోవాలనుకునే వారికి గతాన్ని దక్కించుకోవడం అవసరమౌతుంది. దాన్ని ఎంత అనుకూలంగా మార్చుకోగలిగితే వర్తమానం అంత తేలికగా వశమౌతుంది. అట్లాంటి ప్రయత్నాల ఫలితంగా చరిత్రగురైన వక్రీకరణలను సరిచెయ్యడానికి వస్తున్న పుస్తకం ఇప్పుడు మీ చేతుల్లో ఉంది.

భారత స్వాతంత్ర్యోద్యమం ఒక జాతీయోద్యమం, స్వాతంత్ర్యోద్యమాలన్నిటికీ జాతీయ లక్షణం ఉండదు. ఉదాహరణకు అమెరికా స్వాతంత్ర్యసమరం (1776–83) జాతియోద్యమం కాదు. అది అమెరికన్, బ్రిటన్ సేవల మధ్య జరిగిన యుద్ధం. అమెరికన్ వలస సైన్యం గొప్ప స్వాతం త్రేచ్ఛతో బ్రిటన్‌తో యుద్ధం చేసి విజయం సాధించింది. ఈ సైన్యానికి కొంత ప్రజల అండదండలు లభించిన మాట నిజమే అయినా యుద్ధం జాతీయోద్యమ రూపాన్ని తీసుకోలేదు. 19వ శతాబ్దిలో ముక్కలుగా ఉన్న ఇటలీ జాతీయభావంతో విదేశీ ఆధిపత్యాన్ని అంతమొందించి తమ దేశ ఏకీకరణను సాధించుకున్నది. అదే సమయంలో వందలాది రాజ్యాలుగా విభజితమై విదేశీ పాలనలో ఉన్న జర్మనీ కూడా విముక్తమై ఏకరాజ్యంగా అవతరించింది. అయితే ఈ రెండు దేశాల జాతీయోద్యమ విజయాలు ప్రజలలో మొలకెత్తుతున్న జాతీయ భావాలను స్ఫూర్తిగా తీసుకుని రాచరిక సైన్యాలు యుద్ధాలు చేసి సాధించుకున్నాయి. రెండు ఉద్యమాల్లో ప్రజల ప్రత్యక్ష పాత్ర బహు తక్కువ. అందువల్లనే ఏకీకరణల అనంతరం రెండు రాజ్యాల్లోనూ రాచరిక వ్యవస్థలే ఏర్పడ్డాయి. రిపబ్లిక్ ఏర్పాటుకు ఇటలీలో కొంత ప్రయత్నం జరిగింది కానీ సఫలం కాలేదు. అనుసరించిన మార్గాల ప్రభావం చేరుకున్న గమ్యాల మీద ఉంటుందనే సూత్రానికి రుజువుగా ఈ రెండు దేశాలలో జాతీయభావాలు యుద్ధతత్వానికీ, దురాక్రమణ లకూ దారితీసి యాభై ఏళ్లు తిరక్కుండానే మొదటి ప్రపంచ యుద్ధానికి కారణమయ్యాయి. ఆ తర్వాత ఆ జాతీయ భావాలే ఫాసిజమ్, నాజిజమ్ అనే తీవ్ర జాతీయ భావాలుగా పరిణామం చెంది అనేక విలువల విధ్వంసానికీ, రెండవ ప్రపంచ యుద్ధానికీ కారణమయ్యాయి.

భారత జాతీయోద్యమం ఇందుకు భిన్నమైనది. అది అంతకు ముందు ప్రపంచ చరిత్రలో ఎక్కడాలేని రీతిలో జాతీయ లక్షణాన్ని సంతరించుకుంది. జాతీయ లక్షణం అంటే ఒక ప్రదేశంలో నివసిస్తూ ఒక చరిత్ర

**"వర్తమానం గతంగా మారిన తర్వాత చరిత్రగా పునర్నిర్మింపబడేటపుడు కొన్ని ఇటుకలు ముక్కలైపోతాయి. కొన్ని మరుగున పడతాయి. కొన్ని ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షించబడతాయి. అందువల్ల చరిత్రలో ఖాళీలు ఏర్పడతాయి. వాటిని గుర్తింటచం ముఖ్యం"**


ఒక సంస్కృతి కలిగిన ప్రజలందరూ మతం, కులం, రంగు, జెండర్ ప్రమేయం లేకుండా తమందరి రాజకీయ ఆర్థిక సామాజిక లక్ష్యం ఒకటేనని భావించడం, అట్లాంటి భావన కలిగి ఒక గమ్యం కోసం చేసే ఉద్యమమేదైనా జాతీయోద్యమం అవుతుంది. భారత జాతీయోద్యమం భూస్వాములు, పెట్టుబడిదారులు, మధ్య తరగతివారు, సామాన్యులు, వ్యవసాయ దారులు, చేతివృత్తులవారు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, శిక్కులు, పార్శీలు, బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్ర దళిత కులాలు, ముస్లింలలో మోప్లాలు, బోహ్రాలు, ఖోజాలు, ఇంకా స్త్రీలు, వృద్ధులు, పిల్లలు, దేశంలో అన్ని ప్రాంతాల వారూ ఒకరేమిటీ సహస్రవృత్తుల సమస్త ప్రజలూ పాల్గొన్న అక్షరాలా అంతకు ముందెన్నడూ జరగని ఉద్యమం. స్వాతంత్ర్య పోరాటాలు అంతకు మునుపు యుద్ధ భూములకు పరిమితమయ్యేవి. ఇప్పుడిక్కడ ఉద్యమం నగరాలలోకి, పట్టణాలోకి, గ్రామాలలోకి వ్యాపించింది. శాసనసభల్లోకి, కార్యాలయాలలోకి, పాఠశాలల్లోకి ప్రవేశించింది. మైదానాల్లోకి, కూడల్లకు, రహదారుల మీదకు, ఇళ్లలోకి, జైళ్లలోకి కట్టలు తెంచుకుంది. ఇది అపూర్వం. ఇటువంటి జాతీయోద్యమంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో అన్ని వర్గాల వారు పాల్గొన్నా రు. వారిలో ముస్లిములు నిర్వహించిన పాత్రను ఎన్నిక చేస్తుందీ పుస్తకం. ఇది ఇప్పటి తక్షణ అవసరం. ఎందుకు? ఇది ఈ దేశంలో ముస్లిములు భరతజాతికి చెందినవారు కాదనీ, చొరబాటు దారులనీ, దేశద్రోహులనీ నిందలకు గురౌతున్న సందర్భంలో భారత స్వాతంత్ర్యోద్యమంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో ముస్లిములు నిర్వహించిన అజరామరమైన పాత్రను వెల్లడి చేయడం ద్వారా వారు జాతిలో నీతిలో భాగమని చెబుతుందీ పుస్తకం.

హిందువులు, ముస్లిములు రెండు వేర్వేరు జాతులనే సూత్రీకరణ మొదట బ్రిటీష్ వారి నుంచి మొదలయ్యింది. తొలిసారి భారతదేశ చరిత్ర రాసిన జేమ్స్ మిల్ ప్రాచీన యుగాన్ని హిందూ యుగంగా, మధ్య యుగాన్ని ముస్లిం యుగంగా మత ప్రాతిపదికన నామకరణం చేసి ఆధునిక యుగాన్ని మాత్రం బ్రిటీష్‌యుగం అన్నాడు. ప్రాచీన, మధ్య యుగాల మధ్య తెచ్చిన ఈ మత చీలికను తర్వాత వచ్చిన హెన్రీ ఇలియట్ వంటి చరిత్రకారులు మధ్య యుగాన్ని అనాగరిక యుగంగా చిత్రించడం ద్వారా మరింత ఎడం చేశారు. విదేశీ పాలన తమతోనే ప్రారంభం కాలేదనడానికి వారికి తమకు ముందు పాలించిన ముస్లిములను కూడా విదేశీయులను చేయవలసి రావడమేకాకుండా తమది మెరుగైన పరిపాలన అనిపించుకోవడానికి వారి పాలనను దుర్మార్గమైనదని కూడా చెప్పవలసి వచ్చింది. ఇది అనివార్యంగా హిందువులు స్వదేశీయులనీ, ముస్లిములు విదేశీయులనే విభజనకు దారి తీసింది. ఈ విభజనను రెండు మతాలలోని మతతత్వవాదులు తమకనుకూలంగా మార్చుకున్నారు. ముస్లిం మతతత్వవాదులు ద్విజాతి సిద్ధాంతాన్ని పెంచి పోషించి దేశ విభజనను సాధించుకుంటే, హిందూ మతతత్వవాదులు ముస్లిం, బ్రిటిష్ యుగాల్ని రెండిటిని కలిపి 'వెయ్యేళ్ల బానిసయుగం'గా అభివర్ణించారు. ఇద్దరు విదేశీయుల్లో బ్రిటిష్‌వారు నిష్క్రమించి, ముస్లిములకు ప్రత్యేక దేశం ఇచ్చినా ఇంకా కొందరు కొనసాగుతున్నారనే భావనను వ్యాప్తిచేశారు.

మతతత్వవాదులు మధ్యయుగాన్ని ముస్లిం యుగం అనడాన్ని కొనసాగించారు గానీ అందుకు ఆధారాలు లేవు. మధ్యయుగాన్ని పాలించిన పాలకులందరూ ముస్లిములు, ప్రజలందరూ హిందువులు కారు. పాలకుల్లో అనేకులు హిందువులూ ప్రజల్లో ముస్లిములూ ఉన్నారు. ముస్లిం రాజు పాలన క్రింద హిందువులున్నట్లే, హిందూ పాలకుల పాలనలో ముస్లిములు న్నారు. ఒక ముస్లిము పాలకునితో ఒక హిందూ పాలకుడు యుద్ధం చేసినపుడు ముస్లిం పాలకుని సైన్యంలో హిందువులూ ముస్లిములూ ఉన్నట్టు.. హిందూ పాలకుని సైన్యంలోనూ రెండు మతాల వారు ఉన్నారు. మొఘల్ ఆస్థానంలో హిందువులైన రాజపుత్రులు అన్ని రంగాలలో నిర్వహించిన తిరుగులేని పాత్రతో పాటు మొఘల్ చక్రవర్తులకు మహారాణులై తమ సంతానాన్ని వారసత్వ పీఠాన్ని అధిరోహింప చేసిన చరిత్ర ఒకవైపు, హిందూ ధర్మరక్షణకు కృషి చేసినట్టు చెప్పబడుతున్న విజయనగర, మరాఠా సైన్యాలలో, పాలకుల అంతరంగిక వ్యవహారాలలో ముఖ్యభూమిక వహించిన ముస్లిముల చరిత్ర మరొకవైపు కనిపిస్తుంది. ఔరంగుజేబు సేనానులు ఒక హిందూ బ్రాహ్మణుణ్ణి హిందూ స్వరాజ్య నిర్మాతగా చెప్పబడిన శివాజి దగ్గరకు రాయబారిగా పంపితే, శివాజి ఖాజి హైదర్ అనే ముస్లింను తిరిగి రాయబారిగా పంపిన దాఖలాలు ఉన్నాయి. ఇక ప్రజలలో హిందువులూ ముస్లిములు ఎప్పుడూ కలగలిసిపోయే ఉన్నారు. అయినప్పుడు ఇక ముస్లిం యుగమెక్కడిదీ?







ప్రతులకు: సయ్యద్ నశీర్ అహమ్మద్,
సెల్: 9440241727

ముస్లిములు విదేశీయులనే భావనను బ్రిటీష్ చరిత్రకారులు సృష్టిస్తే హిందూ మతతత్వవాదులు దాన్ని పెంచి పోషించారు. ఎవరు విదేశీయులు అనే ప్రశ్నకు సరైన సమాధానం చెప్పుకోగలిగితే నిజా నిజాలు బయటపడతాయి. దానికి ముందు ముస్లిముల దాడి, ముస్లిముల ఆక్రమణ అనే మాటలకు అర్థం చెప్పుకోవాలి. ముస్లిం 'చొరబాటు' (Invasion) అనే మాటను ఆధునిక చరిత్రకారులు అంగీకరించడం లేదు. దేశం అనేక స్వతంత్ర్య ప్రతిపత్తి కలిగిన చిన్న రాజ్యాలుగా విడిపోయి ప్రపంచంలోనే ఒక దేశి. ఒక సరిహద్దు అని లేని రోజుల్లో ఒకరు వేరొకరి దేశంలోకి 'చొరబడడం' ఎక్కడి నుంచి వస్తుందీ? అందు వల్ల అది 'ఆక్రమణ' కాదు 'విస్తరణ' (Extension) మాత్రమే అంటున్నారు. అది ప్రపంచ వ్యాపితంగా అన్ని ప్రాంతాలలో జరిగిందేనంటున్నారు. ముస్లిములు విదేశీయు లెట్లా అవుతారనేది మరో ప్రశ్న. నేటి మధ్యఆసియా, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాల నుండి భారత దేశంలోకి విస్తరించిన ముస్లిములు తాము ఆక్రమించిన ప్రాంతాలలో స్థిరపడ్డారు. భారతదేశాన్ని మాతృభూమిగా చేసుకున్నారు. పరిపాలించారు. పరిపాలింపబడ్డారు. హిందూ సంస్కృతితో సంఘర్షించారు. విభేదించారు, సంలీనమయ్యారు. మంచి చేశారు. చెడు చేశారు. కాబూల్ నుంచి వచ్చిన మొఘల్ సామ్రాజ్య స్థాపకుడు తిరిగి కాబూల్ వెళ్లిపోలేదు. అంతకు ముందు ఘోరి నుంచి వచ్చి ఢిల్లీ సుల్తానుల రాజ్యాన్ని స్థాపించిన కుతుబ్–ఉద్–దీన్ ఐబక్ ఢిల్లీని విడిచి వెళ్లలేదు. వారు ఈ దేశ సంపదను తాము వచ్చిన ప్రదేశాలకు తరలించలేదు. ఇక్కడే అనుభవించారు. నిర్మాణాలు చేశారు. కళల్ని పోషించారు. సేవల్ని పెంచారు. యుద్ధాలు చేశారు. ఈ మట్టిలోనే కలిశారు. కానీ బ్రిటీష్ వారికి ఒక మాతృదేశం ఉంది. వారు ఈ దేశాన్ని వలస దేశంగా చేసుకుని తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా పరిపాలించి ఈ దేశ సంపదనంతా తరలించుకున్నారు. చివరికి తిరిగి వెళ్లిపోయారు. వారు విదేశీయులు. గజనీ, ఘోరీ, అహమ్మద్ షా అబ్దాలి వంటి వారు పలుసార్లు దేశంపై దండెత్తి సంపదను దోచుకుని తమ మాతృభూములకు వెళ్లిపోయారు. ఎవరైతే తిరిగివెళ్లిపోరో వారు విదేశీయులు. స్థిరపడినవారు విదేశీయులు.

దక్షిణాదిలో ముస్లిముల చరిత్ర 13వ శతాబ్ది చివరి దశలో ప్రారంభమైంది. దక్షిణాపథంలో అల్లా ఉద్దీన్ ఖిల్జీ దేవగిరి (దౌలతాబాద్)ను ఆక్రమించడంతో మొదటి విజయం నమోదైంది. మహమ్మద్ బిన్ తుఘ్లక్ కాలంలో సా.శ.1347లో దక్షిణాది అమీర్లను కూడగట్టి హసన్ గంగూ బహమనీ స్వతంత్రం ప్రకటించడంతో స్వతంత్రబహమనీ రాజ్యస్థాపనతో పాటు దక్షిణాదిన ఒక స్వతంత్రముస్లిం రాజ్యస్థాపన కూడా జరిగింది. స్థూలంగా దక్షిణాదిలో ఉత్తరభాగం బహమనీల వశం కాగా, 1336లో స్థాపితమైన విజయనగర సామ్రాజ్యం దక్షిణంలో దక్షిణానికి విస్తరించింది. ఆంధ్రదేశం విజయనగర, బహనీల మధ్య చేతులు మారి బహమని సామ్రాజ్యం ఐదు రాజ్యాలుగా విడిపోయినపుడు వాటిల్లో ఒకటిగా 16వ శతాబ్ది ప్రారంభంలో ఏర్పడిన గోల్కొండ కుతుబ్


**బ్రిటీష్ వారికి ఒక మాతృదేశం ఉంది. వారు ఈ దేశాన్ని వలస దేశంగా చేసుకుని తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా పరిపాలించి ఈ దేశ సంపదనంతా తరలించుకున్నారు.**

షాహీల క్రిందకు వచ్చింది. 1687లో ఔరంగజేబ్ గోల్కొండను ఆక్రమించడంతో ఆంధ్రదేశం మొఘల్ సామ్రాజ్యంలో విలీనమైంది. ఔరంగ జేబ్ మరణానంతరం మొఘలుల దక్కన్ ప్రతినిధి నిజామ్ ఉల్ ముల్క్ 1724లో హైదరాబాద్‌లో స్వతంత్ర్యం ప్రకటించుకోవడంతో ఆంధ్రదేశం నిజామ్ (అసఫ్ జాహీ) పాలన క్రిందకు వచ్చింది. అసఫ్ జాహీలు తమ పీఠాన్ని నిలుపుకోవడానికి బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ సహాయం తీసుకుని 1766 నాటికి ఉత్తర సర్కారు జిల్లాలైన గంజాం, విశాఖపట్టణం, గోదావరి, కృష్ణా జిల్లాలను, 1787లో గుంటూరును కంపెనీకి ఇచ్చి వేశారు. 1802లో కుదుర్చుకున్న సైన్య సహకార ఒప్పందం ద్వారా రాయలసీమ జిల్లాలైన కడప, కర్నూలు, బళ్లారి, అనంతపురం జిల్లాలను కంపెనీకి దత్తం (Ceded) చేశారు. ఇట్లా ఆంధ్రదేశం విజయన గర, బహమనీ, గోల్కొండ, మొఘల్, అసఫ్ జహీల పాలన మీదుగా కంపెనీ పాలనలోకి వచ్చింది. 1857 తిరుగుబాటు తర్వాత 1858లో బ్రిటిష్ సార్వభౌమత్వం భారతదేశాన్ని స్వాధీనం చేసుకున్నపుడు ఆంధ్రదేశం కూడా బ్రిటీష్ పాలనలోకి వెళ్లింది. తెలంగాణా మాత్రం అసఫ్ జా (నిజాం)ల పాలన లోనే ఉండిపోయింది.


ఆంధ్రదేశ సమాజంలో ముస్లిములు కలిసిపోయారనడానికి ఈ సుదీర్ఘ చరిత్ర తార్కాణం. విభేదించిన, సంఘర్షించిన సందర్భాలు ఉండవచ్చు కానీ అవి బహుస్వల్పం. ఆంధ్రదేశం స్వాతంత్ర్యోద్యమంలో తనదైన పాత్ర నిర్వహించినపుడు ముస్లిములు భుజం భుజం కలిపారు. ఇది 1780లో కంపెనీ ఆజ్ఞలకు వ్యతిరేకంగా విశాఖపట్టణంలో సుబేదార్ షేక్ అహమ్మద్ చేసిన సైనిక తిరుగుబాటుతో మొదలై స్వాతంత్ర్యోద్యమం తరువాత పరిటాల పబ్లిక్ స్థాపనలో పాల్గొన్న షేక్ మౌలానా సాహెబ్ వరకు సాగింది. ఇందులో అల్లూరి సీతారామరాజుకు సహకరించిన ఫజలుల్లాఖాన్, ప్రసిద్ధులైన ఉమర్ అలీషా కవి, ఖద్దరు ఇస్మాయిల్‌గా ప్రసిద్ధినెక్కిన మహమ్మద్ ఇస్మాయిల్, గాంధీప్రేమగా 'మొహిద్దీన్ సాబ్" అని పిలుచుకున్న మహమ్మద్ గులాం మొహిద్దీన్, సైమన్ కమీషన్ వ్యతిరేక పోరాటంలో ఆంధ్రకేసరి ప్రక్కన నిల్చుని ఆయన కంటే ముందు 'ధైర్యం ఉంటే కాల్చు' అని అరచిన మహమ్మద్ గౌస్ బేగ్, దేశం కోసం రంజాన్ పండుగ రోజున సంతోషంగా జైలుకెళ్ళి వచ్చి, చీరాల–పేరాల ఉద్యమంలో రామదం డుకు నాయకత్వం వహించిన మహమ్మద్ గౌస్‌బేగ్, ఖద్దరు ప్రచారానికి, గ్రంథాల యోద్యమానికి విశేష ప్రాచుర్యం కల్పించి విశాఖ గాంధీ అనిపించుకున్న ఫరీద్దుల్ జమా, మతపరమైన కట్టుబాట్లను తెంచుకుని ఉద్యమంలోకి వచ్చిన మహమ్మద్ గౌస్‌ఖాతూన్, సయ్యద్ ముల్లా రాబియాబి వంటి మహిళలు ఉన్నారు.


ఈ **'భారత స్వాతంత్ర్యోద్యమం: ఆంధ్ర ముస్లిం యోధులు'** పుస్తక రచన రెండు విధాలుగా విశిష్టమైంది. ఇది ఒకటి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌కు, రెండు మహమ్మదీయులకు పరిమితమైంది. ఈ పరిమితులే ఈ పుస్తకానికి వైశాల్యాన్ని పెంచుతున్నాయి. ఇది స్థానిక చరిత్రల, అస్తిత్వ ఉద్యమాల యుగం, ఒక ప్రదేశానికి, ఒక సామాజిక వర్గానికి పరిమితమై ఈ పుస్తకం రావడం అభినందించదగ్గ విషయం. ముస్లిం సామాజిక వర్గానికి సంబంధించిన ప్రతి జిల్లా స్థాయిలో ఈ పరిశోధన జరగవలసి ఉంది. ప్రతి గ్రామంలో పట్టణంలో అక్కడ ముస్లిములు స్వాతంత్ర్య సమరంలో నిర్వహించిన పాత్ర మీద సదస్సులు జరగాలి. ఇప్పుడు మతం చిమ్ముతున్న విషానికి ఇవే విరుగుడు అవుతాయి. నశీర్ అహమ్మద్ గారు అనేక పుస్తకాల నుంచి సమాచారాన్ని గ్రహించి, స్వయంగా పరిశోధించిన అంశాలను జోడించి పుస్తక రచన చేశారు. శైలిలో కనిపించే సాహిత్య పోకడలు సాధారణ పాఠకులకు తృప్తినిస్తాయి. వాస్తవాలు గతాన్ని బలమైన ఐక్యతా పునాదుల మీద నిర్మించి వర్తమానంలో అనేక వక్రీకరణలకు సమాధానం చెబుతాయి. అందుకు విరామం లేకుండా కృషి చేస్తున్న సయ్యద్ అహమ్మద్ గారికి అనేకానేక నమస్కా రాలు.

(భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్ర ముస్లిం యోధులు గ్రంథానికి కొప్పర్తి వెంకట రమణ మూర్తి రాసిన ముందు మాట..)



– కొప్పర్తి వెంకట రమణమూర్తి







# పాత్రికేయ ధృవతార ఎం.ఎస్. ఆచార్యకు అక్షర నివాళి

## హైదరాబాద్‌లో ఎం.ఎస్. ఆచార్య విగ్రహం -"న్యూస్ పేపర్ బాయ్ నుంచి డైలీ ఎడిటర్ దాకా" పుస్తకావిష్కరణ

ప్రముఖ పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, 'జనధర్మ' మరియు 'వరంగల్ వాణి' పత్రికల వ్యవస్థాపకుడు కీర్తిశేషులు ఎం.ఎస్. ఆచార్య శతజయంతి సందర్భంగా.. మాడభూషి శ్రీధర్ రచించిన "న్యూస్ పేపర్ బాయ్ నుంచి డైలీ ఎడిటర్ దాకా.. ఎం.ఎస్. ఆచార్య" పుస్తకాన్ని 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో (కొంపెల్లి వెంకట్ గౌడ్ వేదిక) డిసెంబర్ 22 సాయంత్రం ప్రముఖ జర్నలిస్టులు ఆవిష్కరించారు. హైదరా బాద్ జర్నలిస్ట్ కాలనీలో ఎం.ఎస్. ఆచార్య విగ్రహాన్ని నిర్మించడం ఆయనకు అందించే అత్యున్నత నివాళి అని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.


ఈ వేడుకలో ప్రసిద్ధ సంపాదకులు కె. రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, ఎమెస్కో సంపాదకులు జి. వల్లీశ్వర్, సుందరయ్య విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు ఎస్. వినయ్ కుమార్, జర్నలిస్టుల సొసైటీ అధ్యక్షుడు శ్రీ బ్రహ్మాండభేరి గోపరాజు, తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం సొసైటీ జాయింట్ సెక్రటరీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, మరియు సభానిర్వహకులు, పాత్రికేయులు పొన్నం రవిచంద్ర తదితరులు పాల్గొని పుస్తకాన్ని విడుదల చేశారు. కోవెల గోపాల్, 'మన తెలంగాణ' సంపాదకులు డి. అమర్, 'నేటినిజం పత్రిక' సంపాదకులు బైస దేవదాను పుస్తకాలను స్వీకరించారు.

### ఉచిత వైద్యశాల, విద్యా పురస్కారాలు:

మాడభూషి శ్రీధర్ తన తండ్రి జ్ఞాపకార్థం రూ. 10 లక్షల వ్యయంతో వరంగల్ గొర్రెకుంట ఆశ్రమంలో నిర్మించిన ఉచిత వైద్యశాల గత ఏడాది ప్రారంభమై విజయవంతంగా కొనసాగుతోంది. కాకతీయ యూనివర్సిటీలో ఎం.ఎస్. ఆచార్య స్మారక ప్రసంగాలు నిరంతరం నిర్వహిస్తున్నారు. గతంలో ప్రొఫెసర్లు ఎం. రాజగోపాలాచార్య, మాడభూషి శ్రీధర్‌లకు బంగారు పతకాలు ప్రదానం చేసిన కాకతీయ వర్సిటీ, ఇప్పుడు వారిద్దరి సహకారంతో ఎం.ఎస్. ఆచార్య గోల్డ్ మెడల్‌ను అధికారికంగా నెలకొల్పినట్లు ప్రకటించింది.

మాజీ సాక్షి సంపాదకుడు కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ .. ఆచార్య గారి జీవితం ఒక సామాన్యమైన కథ కాదు, అదొక నిరంతర శ్రమ. నిజాం వ్యతిరేక పోరాట సమయంలో పత్రికలు పంపిణీ చేయడమే ఒక సాహసం. ప్రతి ఉదయం పేపర్ బాయ్‌గా ఇంటింటికీ సైకిల్ మీద తిరుగుతూ చందాలు వసూలు చేస్తూ, నిజాం పోలీసుల ఒత్తిళ్లను తట్టుకుని 'వరంగల్ వాణి' వంటి దినపత్రికను నడపడం ఊహకు అందని విషయం. ఈ పుస్తకం ఒక జర్నలిస్టుగా ఆయన సాగించిన స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను మన ముందు ఉంచుతుందని అన్నారు.

ఎమెస్కో ఎడిటర్ జి. వల్లీశ్వర్ మాట్లాడుతూ... ఆచార్య గారు ఒక నిబద్ధత కలిగిన జర్నలిస్టు. వరంగల్ నుంచి 'జనధర్మ' నడుపుతున్నప్పుడు ఎదుర్కొన్న ఆర్థిక, రాజకీయ సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. అప్పట్లో పత్రికా నిర్వహణ ఒక తపస్సు. తండ్రి పత్రికా రంగం ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తే, కుమారుడు శ్రీధర్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా చట్టం ద్వారా వ్యవస్థలను ప్రశ్నిస్తున్నారు. శ్రీధర్ టిటిడి మీద చేసిన రచనలు తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవని అన్నారు.




సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహ కులు ఎస్. వినయ్ కుమార్ మాట్లా డుతూ... ఆచార్య గారు ఆయుధం పట్టని పోరాట వీరుడు. రజాకార్ల దాడుల నుంచి ఉద్యమకారు లకు రక్షణ కల్పించిన గొప్ప వ్యక్తి. వరంగల్‌లో ఆంధ్ర పత్రిక సర్క్యులేషన్‌ను 1200కు పెంచడం ఒక రికార్డు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో గాంధీజీని చూడడం ఆయనను జర్నలిజం వైపు పురికొల్పింది. అలాగే శ్రీధర్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా ఉన్నప్పుడు పెద్దల డిగ్రీ సర్టిఫికేట్లు బహిర్గతం చేయాలని ఇచ్చిన తీర్పులు దేశవ్యాప్త సంచలనం సృష్టించాయి.

కొడుకుగా కాకుండా ఒక శిష్యుడిగా శ్రీధర్ గారు తండ్రి ఆశయాలను గౌరవిస్తున్నారు. ఆచార్య గారి రక్తంలో ఉన్న తెగువ, నిజాయితీ శ్రీధర్ గారి పోరాటాల్లో ప్రతిబింబిస్తున్నాయి. ఈ పుస్తకం నాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతుందని సినీ క్రిటిక్ పొన్నం రవిచంద్ర అన్నారు. మహాత్మా జ్యోతీబాపూలే గురు కుల విద్యాలయం జాయింట్ సెక్ర టరీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లా డుతూ... జర్నలిజం వ్యాపారంగా మారుతున్న నేటి కాలంలో ఆచార్య గారి విలువలు అత్యవసరం. ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజా సమస్యల గొంతుకగా నిలిచారని అన్నారు.

మాజీ ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ జర్నలిజానికి వరంగల్, మహబూబ్ నగర్ వంటి ప్రాంతాలే మూలస్తంభాలు. ఆచార్య గారు తెలుగు పాత్రికేయ రంగంలో ఒక దిగ్గజం. ఆయన విగ్రహం జర్నలిస్ట్ కాలనీలో కొలువు తీరడం అభినందనీయం అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ... "ఆచార్య గారు వరంగల్‌లో పుట్టడం ఆ ఊరి అదృష్టం, కానీ ఆయన గురించి అందరికి తెలియకపోవడం దురదృష్టం" అని 1988లోనే అన్నాను. ఆయన ఎప్పుడూ యాజమాన్యాల ఒత్తిడికి లొంగకుండా ప్రజల పక్షాన నిలిచారని అన్నారు.

జర్నలిస్టుల సొసైటీ అధ్యక్షుడు, బ్రహ్మాండభేరి గోపరాజు మాట్లాడుతూ... జర్నలిస్టుల సొసైటీ ఏకగ్రీవ తీర్మానంతో ఆచార్య గారి విగ్రహ నిర్మాణానికి అంగీకరించింది. ఆరడుగుల ఎత్తుతో, పేపర్ చదువుతున్న భంగిమలో విగ్రహం సిద్ధమైందని తెలిపారు.


నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాస్ మాట్లాడుతూ... 40 ఏళ్ల పరిచయం ఉన్న ఆచార్య గారు నన్ను నిజామాబాద్‌లో పత్రికా నిర్వహణకు ప్రోత్సహించారని తెలిపారు. "అక్షరం అమ్ముడు పోయే వస్తువు కాకూడదు, అది సమాజ చైతన్యానికి ఉపయోగపడే ఆయుధం కావాలి" అన్నదే ఆయన సిద్ధాంతం అని అన్నారు.

చివరగా మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం అనారోగ్యం (స్ట్రోక్) వల్ల అన్నీ మరిచిపోయిన తరుణంలో, భగవం తుడి దయతో, ఆచార్యుల ఆశీస్సులతో ఒక్కో జ్ఞాపకాన్ని కూడగట్టుకుని ఈ పుస్తకాన్ని పూర్తి చేశానని భావోద్వే గంతో తెలిపారు.

కాకతీయ విశ్వవిద్యాలయం లో ఆంగ్లభాషలో ప్రొఫెసర్ ఎం. రాజగోపాలాచార్య, న్యాయశాస్త్రంలో మాడభూషి శ్రీధర్ విడివిడిగా బంగారు పతకాలు సాధించారు. కీర్తిశేషులు ఎం. యస్.ఆచార్య శతజయంతి సందర్భంగా ఉత్తమ పాత్రికేయ విద్యార్థులకు 'ఎం.యస్. ఆచార్య బంగారు పతకాన్ని' ఈ ఇద్దరు ఆచార్యులు నెలకొల్పారని విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు.




జనధర్మ, వరంగల్‌వాణి పత్రికల ఎడిటర్ యం.యస్. ఆచార్య శతజయంతి సందర్భంగా ఆచార్య మాడభూషి శ్రీధర్ రచించిన 'యం.యస్. ఆచార్య' గ్రంథం ఆవిష్కరణలో ప్రసంగిస్తున్న కె. రామచంద్రమూర్తి. వేదికపై పొన్నం రవి చంద్ర, జి.వి. శ్యాంప్రసాద్‌లాల్, ఆచార్య మాడభూషి శ్రీధర్, జి. వల్లీశ్వర్, యస్. వినయ్‌కుమార్, పాశం యాదగిరి, గోపరాజు బ్రహ్మాండభేరి.



సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ అరసం, తెలంగాణ అమరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం డిసెంబర్ 26న ప్రొ॥ఎస్.వి. సత్య నారాయణ, కందిమళ్ల భారతి సంకలనం చేసిన **'శతారుణ గీతాంజలి'** వంద పాటల పుస్తకం, 'ప్రజాపక్షం' సంపాదకులు మక్కెన సుబ్బారావు రూపొందించిన **'వందేళ్ల సీపీఐ చరిత్రలో మైలురాళ్లు'** అనే పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, తెలంగాణ అమరుల స్మారక ట్రస్టు అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఏ చాడ వెంకటరెడ్డి, ట్రస్ట్‌కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ తదితరులు.

# శాస్త్రీయ కళగా మిమిక్రీకి ప్రాచుర్యం

## -ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్ధనమూర్తి తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 31:మిమిక్రీని శాస్త్రీయ కళగా తెలుగు విశ్వ విద్యాలయంలో బోధనాంశంగా నెలకొల్పేందుకు నేరెళ్ల వేణు మాధవ్ చేసిన కృషి విస్మరించలేమని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి అన్నారు. రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు డా॥నేరెళ్ల వేణుమాధవ్ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది.

కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జివిఎన్ రాజు, ప్రముఖ సైకాలజిస్ట్ బివి సత్యనరేష్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెంకటరమణ, సినీ దర్శకుడు, మిమిక్రీ కళాకారులు, కళారత్న రమేష్ పాల్గొన్నారు.

# టెలివిజన్ చరిత్ర గ్రంథం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, డిసెంబర్ 31: సమాజాన్ని ప్రభావితం చేసిన చరిత్ర టెలివిజన్‌ది అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా॥వంకులాభరణం కృష్ణ మోహనరావు అన్నారు. గోమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గాన సభలో కీర్తి పురస్కార గ్రహీత గోస్వామి డా॥ఎన్. గోపాలకృష్ణ రచించిన 40వ గ్రంథం టెలివిజన్ చరిత్ర ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న వకులా భరణం కృష్ణమోహనరావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ యాభై సంవత్సరాల నాడు భారతదేశంలో టెలివిజన్ ఒక చరిత్ర సృష్టించి ఒదన్నారు. అప్పట్లో టెలివిజన్ ఉన్న ఇంటికి చుట్టు పక్కల వారు చేరి వార్తలను చూసేవారని గుర్తు చేశారు. టెలివిజన్ చరిత్ర ఎంతో గొప్పదని, ఎప్పటికి గుర్తుంచుకో దగిందన్నారు.

ఆనాటి టెలివిజన్ చరిత్రను పుస్తక రూపంలో రాసిన గోపాలకృష్ణ రచన మరోసారి యాభై సంవత్సరాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సినీ నటుడు అశోక్‌కుమార్, జర్నలిస్ట్ ఎండి షరీఫ్, కళాపోషకులు జమలాపురం రాధాకృష్ణ, నిర్మాత, దర్శకులు ఎల్. త్రినాథ్, గాయకుడు చింతలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చెను కొత్త ఏడాది.

హుషారు పెంచుకో
ఖుషీలు పంచుకో
వచ్చెను కొత్త ఏడాది.

స్నేహాన్ని చేసుకో బాధల్ని మరిచిపో
వచ్చెను కొత్త ఏడాది .
కాలాన్ని దాటుకుంటూ
ప్రేమల్ని పంచుకుంటూ
గతకాల చేదులన్నీ
తియ్యంగా మార్చుకుంటూ .
చల్నా హై చల్నేదో
జిందగీ జీనేదో .
నీ కోసమొచ్చెను ఏడాది
గుండెల్ని హత్తుకో
గుర్తుగా
మార్చుకో
విజయాల తీరం చేరాలి
"స్వాగతమై వస్తుందిరో
ఏడాది పూలు జల్లి
పిలుపు నివ్వరో....
వచ్చే రోజు మంచి రోజులై నిన్ను
గొప్పవాన్ని చెయ్యాలిరో."
॥హుషారు॥

కదిలిపోయే.. కాలమున్న
విలువ తగ్గ లేని దంట
సంపదెంత తరలిరానీ
కాలము నీకై ఆగని దంట.

భవిత గోరు గమ్యమున్నది
దానిని చేరితేనే గొప్పవాడివి
కష్టపడితే ఫలితమున్నది
నీలో నమ్మకాన్ని పెంచుతుందది.
ద్వేషాన్ని తుంచుకో
తప్పుల్ని దిద్దుకో...
వచ్చెను కొత్త ఏడాది
బాధ్యత పెంచుకో
ధైర్యమై సాగిపో
స్వాగతమన్నది ఏడాది.
॥హుషారు॥

పాత ఏడాది నీకు నేర్పింది
మంచి మాట
కొత్త ఏడాది చూడు
చూపుతోందది బాట.

దిల్లున్న హీరోగా
పవరున్న మనిషిగా
సూర్యుడవై జీవించాలి
కాలాలు ఏవైనా
పోటీలు ఎన్నున్నా
గెలుపుకు పాఠం నేర్వాలి.
॥హుషారు॥




-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

# నూతనోత్సాహం

ఈ నూతన సంవత్సరం
చేరుకోండి ఆశయ శిఖరం
చేసుకోండి జీవనం
నవ నందన వనం.
ఆశల కెరటాలు ఎగిసి
నింగి నంటి మురవాలి
ఆనందం వెల్లువై
ఉరకలెత్తి సాగాలి.

జగతి నందు నిత్యం
హర్ష వర్షం కురవాలి
ప్రపంచ ప్రజానీకం
పరవశించి మురవాలి.
ఇదే ఇదే నా భావన
ఈ నూతన సంవత్సర
శుభ సమయాన
శుభాకాంక్షలు.



-బూర దేవానందం
8143589789

# అపోహ !

భాషనెంత వంకరగా మాట్లాడితే అంత
బట్టలెంత కురచగా వేసుకుంటే అంత
భారీ వాహనాల్లో ఎంత తిరిగితే అంత
బాటదప్పి నడుస్తూ బయట తిరిగితేనే
గొప్పోళ్ళనే అపోహలో మునిగింది లోకం !
అప్పుడు నిండుసభలో ద్రౌపది చీరలాగితే
మహాభారత యుద్ధ ప్రళయమే జరిగింది
శ్రీకృష్ణ పరమాత్మ విశ్వరూపాన్ని దర్శించాం.
నేడు విలువలు , వలువలు దిగజార్చుకొని
చీర సరిగా కప్పుకొమ్మంటే , కుహనావాదుల
నోర్లు డ్రైనేజీలై కుళ్ళిన వరదలై పారుతున్నాయి !
దొర వేశాలతో దొంగ పనులుచేస్తూ బ్రతికే
దగాకోరులంతా గంజాయి వనం మొక్కలే
డబ్బుకై క్యారెక్టర్ కోల్పోయే గుంట నక్కలే
మోసగాళ్ళంతా కుళ్ళిన మాంసం ముక్కలే
నమ్మకద్రోహులంతా నయవంచక కుక్కలే !
అందుకే , ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా
మన రీతి , మన నీతి మనకెప్పుడు జయం
ప్రకృతిలో ధర్మమే మనల్ని కాపాడే కవచం
గుణమే మనల్ని విజేతగా నిలిపే ఆయుధం
తెలుసుకొని మసలుకోవడమే మన జ్ఞానం !



- డా. డి. రాజేశ్
9440460490

# కణిక


సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్:రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



### తప్పనిది తప్పించుకోలేనిది

తప్పనిది, తప్పించుకోలేనిది
మరణం ఒక తలుపు కాదు,
కాలం తెరిచే నిశ్శబ్ద కిటికీ.
పుట్టుకతోనే అడుగు వేస్తాం,
చివరి మలుపు వైపు సాగుతూనే.
భయమా? కాదు? అది నిజం,
అసత్యాల్ని కడిగే తీర్పు.
అహంకారపు గోడల్ని కూల్చి,
మనిషిని మనిషిగా నిలిపే శక్తి.
ధనమూ దర్పమూ
అక్కడ మౌనం,
బంధాలే మాట్లాడే చివరి భాష.
మిగిలేది
మనం పంచిన మంచితనం,
విడిచిన వెలుగే శాశ్వత స్మృతి.
తప్పించుకోలేనిదే
అయినా మరణం,
భయపడక
నేర్చుకోవాల్సిన బోధ.
ఈ క్షణాన్ని ప్రేమగా జీవిస్తే,
మరణమూ
నమస్కరించి వెళ్లిపోతుంది.

-రాజ్యలక్ష్మి శశిధర్. ఐ

### నిగూఢ సత్యం – ఆచరణ శూన్యం

మానవులకు మరణం తథ్యమనే నిగూఢ సత్యం తెలిసినా
ఎందుకో మరి వీడని ఆశ దురాశ పేరాశల దుఃఖ భాజనాలు.
ఐహిక సుఖాలు, మాయామోహాలు అశాశ్వతమని తెలిసినా
మరెందుకో ప్రతిక్షణం ఈ కపట నాటకాలు, ఆత్మబలిదానాలు.
డబ్బులిచ్చి దరిద్రం కొనుక్కోవడమెందుకనే నిగూఢ రహస్యాన్ని విప్పిచెప్పినా
నాడు నిర్భీతితో ముందడుగేసిన వారి జీవితాలు నేడైనాయి హాస్యస్ఫోరకాలు .
ప్రతిఫలాపేక్ష ఆశించక నీ విధ్యుక్తధర్మాల్ని నిర్వర్తించమని శ్రీకృష్ణతత్వం తెలిపినా
ఎందులకో మరి పరనిందయుక్త అవివేక కార్యాలు, ఆచరణ శూన్యాలు.
మహిలోని నిగూఢ నిజాల్ని, నిత్య సత్యాల్ని మార్మిక ప్రకృతి ఎంతో ఎరుకపరిచినా
మూఢులైన మనుషులు మూర్ఖత్వంతో చేస్తున్నారు అవనిని వినాశ కారకాలు .
పంచభూతాల పర్యావరణం ప్రతిక్షణం విపులీకరిస్తూ హితోపదేశం చేస్తున్నా
నిర్లక్ష్యంతో చేజేతులా కొనితెచ్చుకుంటున్నారు ప్రళయ ప్రకోప ముప్పు తిప్పలు .
అనునిత్యం అంతరార్థ0గా నిగూఢ సత్యాలు మనల్ని తట్టిచెబుతున్నా...
మనసుకు ముసుగేసి, మేధో సంకేతాలను చెరిపేసి జీవనం గడుపుతున్నా...
ఇక ఇప్పుడైనా ధర్మయుక్త జీవిత సత్యాలనీ, జీవన మార్గాలని సదా అన్వేషించుదాం
శ్రీమద్భగవద్గీత బోధించిన నిత్యసత్యాలను ఆచరించి నిర్మలానంద ఫలాలను ఆస్వాదించుదాం

-ఎస్. రత్నలక్ష్మి
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,జల వనరుల శాఖ

### శాసనం

మరణం అంటే మహా భయం మనిషికి...
చెప్పి రాని ఓ వరమే ఐనా అనివార్యం...
జనన మరణ చక్రభ్రమణంలో
మనిషి ఆరాట పోరాటాలతో
అలుపు సలుపు లేని జీవనయానంలో,
స్వార్థంతో కూడి,
ప్రతీకారులతో జతకట్టి,
పగద్వేషాలను కూడబలుక్కుని...
కుట్రలు కూతంత్రాలతో
ప్రతి గడియ అసంతృప్తిజాలలతో రగిలిపోతూ..
ఎన్నెన్నో దుర్గుణాలను కూడ పెట్టుకుని ,
పాప భ్రష్టులై ఎన్నెన్నో దురాక్రమణాలతో
జీవిత పోరాటం కొనసాగిస్తూ
చెప్పిరాని మరణ భయం వేటాడినా,
మరణం తధ్యమని తెలిసిన
పాప పుణ్యాల పట్టువిడుపుల నడుమ
బతుకు యానం పద్మవ్యూహమే....
పుట్టుక బతుకుకు తొలి పేజీ అయితే,
చావు ఆఖరి పేజీ కామాలు ఉండవు ఫులిస్టాపే...
మంచి చెడులతో జన్మను చరితార్థం చేసుకోవడమే
మనిషి బతకకు సార్థకత..

-కొంజేటి రాధిక, రాయదుర్గం

### జన్మ సార్థకత

పుట్టిన ప్రతి జీవీ గిట్టుట అనివార్యమే..
ఆ పుట్టుకకో పరమార్థమన్నది కల్పించేది కొందరే!.
దుర్వ్యసనాలతో కుటుంబానికి,
దేశానికి హాని కలిగించే వారు కొందరైతే..
సమయాన్ని దుర్వినియోగపరుస్తూ
బాధ్యతలు మరిచేవారు కొందరు!.
విజయశిఖరాలనెక్కి అహంభావం తలకెక్కి..
చేయూతనిచ్చిన పునాదుల్ని మరిస్తే పతనానికే దారి..
ఎంత మేధాశక్తి ఉన్నా..
అవగుణాలు,దుర్వ్యసనాలతో
పతన పాతాళానికి రహదారి!.
ఎన్ని సిరిసంపదలున్నా..
పిసినారి గుణంతో పీడించే
వారితో కుటుంబానికి
భూలోక నరకమే!.
ఎన్ని కీర్తి ప్రతిష్టలున్నా..
వినయ విధేయతలు లేని
ప్రతిభ సున్నా!.
నియంతృత్వ అభిజాత్యంతో
పతనమైన రాజ్యాలెన్నో..
కాలగర్భాన కలిసిపోయిన రాజులెందరో..
విశ్వ విజేత అలెగ్జాండర్ సమాధిపైని
ఖాళీచేతులు ఇచ్చే సందేశమదే!
పతనమైనా అశోక చక్రవర్తిలా
పశ్చాత్తాపంతో పైకెదగాలి..
దుర్వ్యసనాల పాలైనా..
పాండురబుద్దెరిగి ప్రవర్తించాలి!
భోగలాలసులైనా..
యోగి వేమనలై నీతి
శతకాలు వల్లించాలి!
గొంగళి పురుగు వంటి దశ నుండి
సీతాకోకచిలుకగా మారి మానవజన్మకు
సార్థకతనివ్వాలి..
చివరికి మిగిలేదేమిటో
ముందే ఎరిగి..బ్రతకడం కాక..
అప్రమత్తతతో జీవించాలి!

-చంద్రకళ.దీకొండ

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com